
అభ్యుదయం

RNI: TEL TEL /2019/12836

The Pride of Telugu national daily



Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో
నియోజక వర్గాల వారిగా
విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263

పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ ఆదివారం 18-10- 2026 సంపుటి : 6 సంచిక : 246 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00

ఈనెల 24 వరకు సౌదీకి విమాన సర్వీసుల బంద్



2లో

- ఇండిగో, ఆకాశ ఎయిర్ విమానయాన సంస్థలు భారత్ నుంచి సౌదీకి రద్దు
- గల్ఫ్ దేశాల్లో పరిస్థితులు మెరుగుపడకపోవడంతో
- విమాన సర్వీసుల రద్దు ఆకాశ ఎయిర్ ఒక ప్రకటన

ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు

- టీడీపీ, వైసీపీలది ప్రతీకార రాజకీయం
- స్వేచ్ఛాయుత ఎన్నికలకు చర్యలు తీసుకోవాలి
- ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి



2లో

తెలంగాణ ప్రయోజనాలకు తీరని ముప్పు

2లో మిగతా

గోదావరి-కావేరి లింకు ముసుగులో తెలంగాణ నీటి హక్కులకు మరణశాసనం

- గురువుకు రేవంత్ దాసోహం.. దన్నుగా కేంద్రం
- ఎన్డబ్ల్యూడీఏ సమావేశ ఎజెండాగా జీసీ లింకు
- ఆ ముసుగులో బనకచర్ల ప్రాజెక్టుకు ప్రణాళికలు
- కృష్ణానదీ జలాల్లోనూ రాష్ట్రానికి తీరని అన్యాయం
- కాంగ్రెస్ నిర్వాకంతో మన ప్రాజెక్టులకు ముప్పు
- బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్ నిప్పులు



హైదరాబాద్, **అభ్యుదయం**

గోదావరి-కావేరి లింకు ముసుగులో బనకచర్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని వివరించారు. ఇటు గోదావరి, అటు కృష్ణాలో తెలంగాణ నీటి వాటాలకు ఎసరు పెడుతున్నారని చెప్పారు. తెలంగాణ ప్రయోజనాలకు తీరని ముప్పు వాటిల్లుతున్నా ఇక్కడి రేవంత్‌రెడ్డి సర్కార్ మాత్రం మొద్దునిద్రలో ఉన్నదని నిప్పులు చెరిగారు.తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యేలు గంద్ర వెంకటరమణారెడ్డి, అల వెంకటేశ్వర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి శనివారం ప్రత్యేకంగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ ఢిల్లీలో నవంబర్ 3న ఎన్డబ్ల్యూడీఏ సమావేశం


24 గంటల పాటు మోటర్లు ఆన్‌చేసి నీళ్లెత్తలేదు. పంప్‌హౌస్‌ల వద్దకు తీసుకెళ్తే సర్కార్ ఫెయిల్యూర్‌ను చూపిస్తా? ఎన్ని గంటలు నడిపినవో? ఎన్ని నీళ్లెత్తినవో తెలుస్తుంది. కల్వకుర్తిలో 35 టీఎంసీలు ఎత్తే అవకాశముంటే 13 టీఎంసీలే ఎత్తి మిగిలినవి ఏపీకి ధారాదత్తం చేసినవు. రుజువు చేయడానికి రెడీగా ఉన్నా.. పోదాం పా..

సీఎం రేవంత్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు



హైదరాబాద్,**అభ్యుదయం**

సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ఆడబిడ్డలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు, ఆడబిడ్డల ఆరాధనకు బతుకమ్మ నిలువెత్తు నిదర్శనమన్నారు. తీరొక్క పూలతో, ఘనమైన బతుకమ్మలతో ఆడబిడ్డలంతా ఆటపాటలతో సద్దుల బతుకమ్మ సంబురాలను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పండుగ వేళ ప్రతి ఇంటా సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలన్నారు. తెలంగాణ ఆడబిడ్డలకు మాజీ సీఎం కేసీఆర్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.



సరస్వతీ దేవి అలంకారంలో భద్రకాళి అమ్మవారు

- భక్తజన సంద్రంగా మారిన భద్రకాళి ఆలయం
- రూ.కోటి వ్యయంతో నిర్మించిన 27 అడుగుల రథం ఆలయానికి సమర్పణ
- అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

వరంగల్, **అభ్యుదయం**

చారిత్రక ప్రసిద్ధిగాంచిన వరంగల్ శ్రీ భద్రకాళి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఏడో రోజుకు చేరుకున్నాయి. శనివారం అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున 4 గంటలకు నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారిని సరస్వతీ మాతగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకుంటే సకల

- మిగతా 2లో పేజీలో



బ్రెయిన్ క్యాన్సర్ బాధితుడికి కేటీఆర్ భరోసా..


హైదరాబాద్, అభ్యుదయం బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న కర్నె వినయ్(13)కు బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నరసింహులగూడెం గ్రామానికి చెందిన కర్నె ఆదినారాయణ- అనిత కుమారుడు వినయ్ కొంతకాలంగా బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు.పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ చొరవతో బాలుడు శనివారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిశాడు. వినయ్‌తో కేటీఆర్ ఆప్యాయంగా మాట్లాడి, అతని ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. బాలుడి కుటుంబం ఆందోళన చెందవద్దని, వినయ్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు అందగా ఉంటానని భరోసా ఇచ్చా రు. కేటీఆర్ సూచనల మేరకు వినయ్‌ను సిం ధు దవాఖానలో చేర్పించారు.

ఒకరి ఉద్యోగం మరొకరు ఊడగొట్టేందుకు ఎత్తులకు పైఎత్తులు

- తన వైఫల్యాలు హైకమాండ్‌కు వివరించిన
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్ టార్గెట్
- ప్రజల్లో వారిని దోషిగా చూపేందుకు సీఎం ప్లాన్
- సీఎం పదవి ఊడగొట్టేందుకు మంత్రుల ప్రయత్నం
- ప్రభుత్వంలో పరాకాష్టకు చేరినప్రచ్ఛన్నయుద్ధం
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి

జగిత్యాల, **అభ్యుదయం**

: ఒకరి ఉద్యోగం మరొకరు ఊడగొట్టేందుకు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారని, ప్రధానంగా సీఎంను తొలగించేందుకు డిప్యూటీ సీఎం, మంత్రులు ప్రయత్నిస్తుంటే.. డిప్యూటీ సీఎంతోపాటు కొంత మంది మంత్రులను సీఎం టార్గెట్ చేసి.. వారి కొలువులకు ఎసరు పెట్టేందుకు పావులు కదుపుతున్నారని పేర్కొన్నారు.రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, రేవంత్ పాలనా వైఫల్యాలు, అవినీతి, అక్రమాలు, ప్రజల్లో పార్టీపై పెరుగుతున్న వ్యతిరేకత వంటి అంశాలపై డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాహుల్‌గాంధీతోపాటు, కాంగ్రెస్ హైకమాండ్‌కు నివేదించారని, దీంతో ఆ



ఇద్దర్ని సీఎం టార్గెట్ చేశారని ఆరోపించారు. ఇందులో భాగంగానే వారు నిర్వహిస్తున్న శాఖల్లో విఫలమయ్యారంటూ ప్రజాక్షేత్రంలో దోషులుగా చిత్రికరించేందుకు రేవంత్ తన వ్యూహాన్ని అమలు చేస్తున్నారని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

మిగతా 2లో



కూటమి అరాచకాలను ఎన్నికల కమిషన్ చూస్తూ ఊరుకోవడం సరికాదు

- స్థానిక ఎన్నికల్లో దౌర్జన్యకాండపై ఎస్ఈసీ తక్షణమే స్పందించాలి
- శాసన మండలివిపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పష్టీకరణ

2లో

కూటమి అరాచకాలను ఎన్నికల కమిషన్ చూస్తూ ఊరుకోవడం సరికాదు

విశాఖపట్నం, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షాన్ని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం సాగిస్తున్న దౌర్జన్యకాండను రాష్ట్ర ఎన్నికల కమిషన్ చూస్తూ ఊరుకోవడం సరికాదని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు రోజులుగా కూటమి చేస్తున్న అరాచకాలను నియంత్రించేందుకు ఎస్ఈసీ తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు.

విశాఖపట్నంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మీడియాతో బొత్స మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు. ఎస్ఈసీ అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గకుండా, ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంత ముఖ్యమో నామినేషన్ వేసే హక్కు కూడా అంతే ముఖ్యమని, కూటమి పాలనలో మాత్రం ఏ పౌరునికి ఎటువంటి స్వేచ్ఛ, హక్కులు లేకుండా బెదిరింపులు, దాడులు, దౌర్జన్యాలు సాగిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, బెదిరింపులు చోటుచేసుకోకుండా పర్యవేక్షించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తేల్చి చెప్పారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడటం ఎన్నికల కమిషన్ బాధ్యత అని, అంతే తప్ప అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా వ్యవహరించడం కాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని ఆయన గుర్తు చేసారు. రాయలసీమతో పాటు పల్నాడు ప్రాంతాల్లో నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా దౌర్జన్యాలు, బెదిరింపులు, ప్రత్యర్థి అభ్యర్థులను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలనే తాపత్రయంతో ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కడం ప్రజాస్వామ్య సంప్రదాయం కాదని గుర్తు చేశారు. అధికార బలాన్ని ఉపయోగించి ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ఆ హక్కును హరించే ప్రయత్నాలను సహించరాదని పేర్కొన్నారు.

గ్రేటర్ లో గెలిపిస్తే మెరుగైన పాలన అందిస్తాం:

మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రజల ముందుకు వెళ్తారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తారు. మేయర్ అభ్యర్థితో పాటు కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించి విశాఖ అభివృద్ధికి సహకరించాలని నగర ఓటర్లను కోరుతున్నా. ప్రజలకు మంచి పరిపాలన అందించడమే మా లక్ష్యం. గతంలో మేము అందించిన పాలనను మించిన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. విశాఖ ప్రజలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు ఇచ్చి గెలిపించాలి.

జీవీఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. మొత్తం 120 డివిజన్లలో పార్టీ అభ్యర్థులను బరిలోకి దించేందుకు కసరత్తు పూర్తి చేస్తున్నాం. ఇప్పటికే 74 డివిజన్లకు అభ్యర్థులను ప్రకటించాం, తాజాగా మరో 34 డివిజన్లకు అభ్యర్థులను కూడా ఇప్పుడు ప్రకటించాం. మిగిలిన 12 డివిజన్ల అభ్యర్థుల పేర్లను ఆదివారం ఉదయం ప్రకటిస్తాం.

ప్రజలను భయపెట్టి వైసీపీ ఏం సాధిస్తుంది?

తెనాలి, పులివెందులలో శనివారం జరిగిన సంఘటన ప్రజాస్వామ్యానికి చీకటి రోజు. సమాజంలో అల్లర్లు, అలజడులు సృష్టించి ప్రజల్ని భయాందోళనలకు గురి చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని మూర్ఖంగా వైసీపీ ఆలోచిస్తుందని రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖామంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో ప్రజలను భయపెట్టినట్లుగా ఇప్పుడు కూడా అదే పంథాను కొనసాగిస్తుందని చెప్పారు. తెనాలిలో శనివారం నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పూర్తి ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరగాలని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించి ప్రతి ఒక్కరికి ఎన్నికల్లో పాల్గొనేలా అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆకాంక్షిస్తున్నారు. ప్రతి ఒక్కరూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనాలని భావిస్తున్నారు. గత ప్రభుత్వంలో జరిగినట్లుగా ఏకగ్రీవాల కోసం అరాచకాలు సృష్టించిన విధంగా కాకుండా ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోంది. అయితే ఇందుకు విరుద్ధంగా వైసీపీ మాత్రం రాష్ట్రంలో అలజడులు, అశాంతి సృష్టించి ప్రజలను భయపెట్టాలని భావిస్తోంది. గత ప్రభుత్వంలో కనీసం నామినేషన్లు కూడా వేయనివ్వకుండా వైసీపీ చేసిన పిచ్చి ఆలోచనలతో ప్రజలంతా ఎంత ఇబ్బందిపడ్డారో రాష్ట్రమంతా చూసింది. ఇప్పుడు కూడా అదే పంథాలో వైసీపీ ఉండడం దురదృష్టకరం. పులివెందులలో శనివారం వైసీపీ ప్రేరేపిత హింసాత్మక సంఘటనలు అత్యంత దురదృష్టకరం. దీనిని ప్రజాస్వామ్యవాదులు ఖండించాలి అన్నారు.

ఈనెల 24 వరకు సౌదీకి విమాన సర్వీసుల బంద్

సౌదీ, గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండడంతో విమానయాన సంస్థలు సౌదీకి తమ సర్వీసులను ఈనెల 24 వరకు నిలిపివేశాయి. ఈ మేరకు ఆ సంస్థలు శనివారం ఒక ప్రకటన విడుదల చేశాయి. ఇండిగో, ఆకాశ ఎయిర్ విమానయాన సంస్థలు భారత్ నుంచి సౌదీకి తమ విమాన రాకపోకలను ఈనెల 24 వరకు రద్దుచేయగా.. ఎయిర్ ఇండియా ఈనెల 20 వరకు తన సర్వీసులను క్యాన్సిల్ చేసింది.

ఈనెల 24 వరకు సౌదీకి విమాన సర్వీసుల బంద్

ఇంటర్‌నెట్ డెస్క్: గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండడంతో విమానయాన సంస్థలు సౌదీకి తమ సర్వీసులను ఈనెల 24 వరకు నిలిపివేశాయి. ఈ మేరకు ఆ సంస్థలు శనివారం ఒక ప్రకటన విడుదల చేశాయి. ఇండిగో, ఆకాశ ఎయిర్ విమానయాన సంస్థలు భారత్ నుంచి సౌదీకి తమ విమాన రాకపోకలను ఈనెల 24 వరకు రద్దుచేయగా.. ఎయిర్ ఇండియా ఈనెల 20 వరకు తన సర్వీసులను క్యాన్సిల్ చేసింది. అంతకుముందు ఈ సంస్థలు ఈనెల 17 వరకు తమ సర్వీసులను రద్దుచేసిన విషయం తెలిసిందే. గల్ఫ్ దేశాల్లో పరిస్థితులు మెరుగుపడకపోవడంతో విమాన సర్వీసుల రద్దును ఈనెల 24 వరకు పొడిగించాయి. 'సౌదీ అరేబియాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. ఉద్రిక్తతల నేపథ్యంలో రియాద్, జెద్దా, దమ్మం, మదీనాకు మా సర్వీసులను ఈనెల 24 వరకు రద్దు చేయాలని నిర్ణయించాం. ప్రభావిత కస్టమర్లకు ఈ మేరకు నోటిఫికేషన్లు పంపాం. వారికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నాం' అని ఇండిగో ఒక ప్రకటనలో తెలిపింది. కాగా.. ఢిల్లీ, హైదరాబాద్, ముంబై నుంచి రియాద్‌కు ఇండిగో విమాన సర్వీసులు నడుపుతోంది.

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రియాద్‌కు భారత్ నుంచి విమానాల రాకపోకలను ఈనెల 24 వరకు నిలిపివేయాలని నిర్ణయించామని ఆకాశ ఎయిర్ ఒక ప్రకటనలో వెల్లడించింది. అలాగే, జెద్దాకు ఈనెల 21 వరకు విమాన సర్వీసులను పొడిగించామని ఆకాశ ఎయిర్ తెలిపింది. ఇక ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కూడా దమ్మం, జెద్దా, రియాద్‌కు తమ సర్వీసులను ఈనెల 20 వరకు నిలిపివేశాయి. ఈ మేరకు ఆ రెండు సంస్థలు ఒక ప్రకటన విడుదల చేశాయి. కాగా.. కేరళలోని కోజికోడ్ నుంచి రియాద్‌కు రోజువారీ విమానాలను.. బెంగళూరు, కోచి, కన్నూర్ నుంచి వారానికి మూడు విమానాలను ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నడుపుతోంది. అలాగే బెంగళూరు, మంగళూరు, ఢిల్లీ నుంచి దమ్మంకు.. కోజికోడ్, మంగళూరు, బెంగళూరు నుంచి జెద్దాకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలు నడుపుతున్నది.

ఏపీలో జరుగుతున్నది ఎన్నికలు కాదు..

శనివారం తాడేపల్లిలోని వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ప్రజలకు చేసిందేమీ లేక, ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదన్న భయంతోనే ప్రతిపక్ష అభ్యర్థులు కనీసం నామినేషన్లు కూడా వేయకుండా పోలీసుల అండతో భౌతిక దాడులకు తెగబడుతోందని మండిప డ్డారు. పులివెందుల వంటి చోట్ల పోలీసులే నేరుగా కార్లపై దాడులు చేయడం అధికార పక్ష కిరాయి సైన్యంలాంటి తీరుకు అద్దం పడుతోందని ఆరోపించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) పూర్తిగా నిష్క్రియాపరంగా మారిపోయిందని, వ్యవస్థలను మేనేజ్ చేస్తూ చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి, తమ పాలనపై ధైర్యం ఉంటే ప్రతిపక్ష అభ్యర్థులను స్వేచ్ఛగా నామినేషన్లు వేయనిచ్చి, ఎన్నికల బరిలో ప్రజా తీర్పును ఆహ్వానించాలని ఆయన సవాల్ విసిరారు.రాష్ట్రంలో జరుగుతున్నది స్థానిక సంస్థల ఎన్నికలు ఎంతమాత్రం కాదు. ఇది ముందస్తు ప్రణాళికతో చంద్రబాబు నాయుడు నడిపిస్తున్న ఒక ఆర్గనైజ్డ్ క్రైమ్. ఎన్నికల పేరుతో ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేస్తున్నారు. 15 లక్షల మంది మృతుల ఓట్లతో పాటు మరో 29 లక్షల బోగస్, డూప్లికేట్ ఓట్లు.. ఇలా మొత్తం 44 లక్షల అనుమానాస్పద ఓట్లు జాబితాలో ఉన్నాయి. దగ్గరలోనే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ముగుస్తున్న తరుణంలో దాన్ని పూర్తికాకముందే ఇంత హడావుడిగా లేని ఓట్లతో ఎన్నికలు జరపాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎందుకొచ్చింది? కేవలం 12 రోజుల్లోనే మొత్తం తంతు ముగించేలా కుట్ర పన్నారు. చిట్టచివరి నిమిషంలో రిజర్వేషన్లు ప్రకటించి, ఎవరూ సిద్ధం కాకుండా చేశారు. అధికారంలో ఉన్న అడ్వాంటేజ్‌తో ప్రతిపక్షానికి అసలు అవకాశమే లేకుండా షెడ్యూల్ ఖరారు చేసుకున్నారు.దేశంలో ఎక్కడా లేని విధంగా నామినేషన్లకు రోజుకు కేవలం నాలుగు గంటలు (ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు) మాత్రమే సమయం ఇచ్చారు. ఆ నాలుగు గంటల్లో కూడా వైయస్సార్సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి వస్తే భౌతికంగా అడ్డుకుంటున్నారు.

ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు

అమరావతి టీడీపీ, వైసీపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు దాష్టీక రాజకీయాలు చేస్తూ, ప్రతీకారాలతో రతనాల సీమను రక్తసీమగా మారుస్తున్నాయని ఆరోపించారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను మరో 'సౌత్ బీహార్'గా మార్చే పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలపై సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాయచోటి, పుంగనూరులో జరిగిన ఘర్షణలు రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఆందోళనకరమైన పరిణామాలని షర్మిల అన్నారు. ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికలను ఘర్షణలు, దాడులతో రణరంగంగా మారుస్తున్నారని విమర్శించారు. కూటమిది నిజంగా పవిత్ర పాలనే అయితే దాడులు ఎందుకు? బలవంతపు ఏకగ్రీవాలు ఎందుకు? నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడమెందుకు? అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. నాడు వైసీపీ హయాంలో హింసాకాండ జరిగితే, నేడు టీడీపీ హయాంలో అంతకుమించిన ఘోరాలు జరుగుతున్నాయని ఆమె పోల్చారు.

దసరా ఉత్సవాల సందర్భంగా ట్రైసిటీలో ట్రాఫిక్ ఆంక్షలు

వరంగల్, అక్టోబర్ 17 ఉర్సు రంగలీల మైదానంలో జరిగే దసరా ఉత్సవాల సందర్భంగా అక్టోబర్ 20 మధ్యాహ్నం 3 గంటల నుంచి 21వ తేదీ తెల్లవారుజామున 3 గంటల వరకు ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. ఖమ్మం నుంచి కరీంనగర్, హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు ఫున్నెలు క్రాస్, ఐనవోలు, కరీంనగర్ నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలు కేయూసీ, పెద్దమ్మగడ్డ, పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ, ఫోర్ట్ రోడ్డు మీదుగా, హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలు కరుణాపురం, వెంకటాపురం, ఐనవోలు మీదుగా వెళ్లాలన్నారు.

ఒకరి ఉద్యోగం మరొకరు ఊడగొట్టేందుకు ఎత్తులకు పైఎత్తులు



విద్యుత్తు శాఖ మంత్రి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క లేకుండానే ఆ శాఖపై సీఎం సమీక్ష నిర్వహించడమే కాదు.. సమీక్షలో 'మీరు మారడం లేదు. ఉత్పత్తి జరుగడం లేదు. ఉద్యోగం ఊడుద్ది' అంటూ హెచ్చరికలు జారీ చేయడం వెనుక మతలబు ఇదేనని ఆయన స్పష్టంచేశారు. ఇదిలావుంటే ముఖ్యమంత్రి ఇటీవల జరిగిన అనేక సమీక్షల్లో తన వైఫల్యాలను స్పష్టంగా అంగీకరిస్తున్నారని, ఈ పరిస్థితుల్లో కేంద్రం కల్పించుకొని ఆర్టికల్ 356 ప్రకారం రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేశారు. శనివారం ఆయన 'నమస్తే'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అనేక అంశాలను వెల్లడించారు.

సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల మధ్య విభేదాలున్నాయని మీరు ఎలా చెప్పగలరు?

జీవన్‌రెడ్డి: ఈ విషయంలో నాకు పక్కా సమాచారం ఉన్నది. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు మధ్య ప్రచ్ఛన్న యుద్ధమే కాదు.. తీవ్ర విభేదాలు ఉన్నాయి. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలన వైఫల్యాలు, ఆయన చేస్తున్న అవినీతి, ప్రభుత్వ వైఫల్యం, రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులు, ప్రజాగ్రహం తదితర విషయాలన్నింటిపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ హైకమాండ్‌కు, రాల్‌గాంధీ, ప్రియాంకగాంధీకి నివేదిక రూపంలో వివరించారు. రాష్ట్రంలో పాలన సరిగా లేదని.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నదని వారు వివరించడంతో డిప్యూటీ సీఎం, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సీఎంకు మధ్య అంతర్గత విభేదాలు తీవ్రస్థాయికి చేరాయి.

సరస్వతీ దేవి అలంకారంలో భద్రకాళి అమ్మవారు

విద్యలు, జ్ఞానం సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసమని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక రథసేవ నిర్వహించారు. మానవ శరీరాన్ని రథంతో పోలుస్తారని, అమ్మవారి రథాన్ని లాగడం ద్వారా జీవిత ప్రయాణం సాఫీగా సాగుతుందని భక్తుల నమ్మకమని అర్చకులు వివరించారు. దీంతో భక్తులు ఉత్సాహంగా రథసేవలో పాల్గొన్నారు. నవరాత్రి కల్పాన్ని అనుసరించి కాళరాత్రి, రక్తబీజహా దుర్గా క్రమంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా భద్రకాళి అమ్మవారి జన్మోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.భద్రకాళి దేవస్థానంలో నూతనంగా రూ.కోటి వ్యయంతో తయారు చేయించిన 27 అడుగుల ఎత్తైన రథాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ఆలయానికి సమర్పించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు, వారి బంధుమిత్రుల సహకారంతో ఈ రథాన్ని తయారు చేయించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా నిర్మించిన ఈ రథం భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

తెలంగాణ ప్రయోజనాలకు తీరని ముప్పు

నిర్వహించనున్నదని, ఎజెండాను అన్ని రాష్ట్రాలకు పంపిందని వివరించారు.

అందులో గోదావరి-కావేరి లింకును చేర్చారని, ఆ ముసుగులో తెలంగాణపై పెద్ద కుట్రకు తెరతీశారని వివరించారు.

నాడు కుక్కిన పేనులా పడుండి.. నేడు కుట్ర లుకేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నం తకాలం కుకిన పేనులా పడున్న తెలంగాణ ద్రోహులంతా ఇవ్వాళ మళ్లీ నిద్రలేచారని, కుట్రలకు పాల్పడుతున్నారని హరీశ్ ధ్వజమెత్తారు. జీసీ లింకును ఇచ్చంపల్లి, సమ్మక్క సాగర్ నుంచే చేపట్టాలని తాము అధికారంలో ఉన్నప్పుడు పట్టుబట్టామని, ఆ ప్రతిపాదనలకు అనుగుణంగా అన్ని రాష్ట్రాలతో ఎంవోయూకు సైతం ఎన్డబ ్ల్యూడీఏ సిద్ధపడిందని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఇప్పుడు కొత్తకుట్రలు ప్రారంభమయ్యాయని, గత ప్రతిపాదనలను కేంద్రం పక్కకు నెడుతున్నదని ధ్వజమెత్తారు. అక్టోబర్ 7న కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు చంద్రబాబు లేఖ రాశారని, గోదావరి-కావేరి లింకును పోలవరం నుంచి చేపట్టాలని, ఎజెండాలో చేర్చాలని కోరారని, అందుకు అనుగుణంగానే ప్రస్తుతం ఎన్డబ్ల్యూడీఏ ఎజెండాలో ఆ అంశాన్ని పొందుపరిచారని ఆక్షేపించారు.జీసీ లింకు ముసుగులో పోలవరం- బనకచర్ల లింకు ప్రాజెక్టును ముందుకు తీసుకుపోయి, గోదావరి జలాలను అక్రమంగా ఆంధ్రాకు తరలించేందుకు విష కూటమిలా తయారయ్యారని, కోవర్టు రేవంతు తెలంగాణ నీటి హకులను నిండా ముంచుతున్నాడని మండిపడ్డారు. తొలుత గోదావరిలో 200 టీఎంసీలు తీసుకుపోయేందుకు పోలవరం-బనకచర్లను, ఆపై నల్లమలసాగర్‌ను తెరమీదికి తెచ్చారని, బీఆర్ఎస్ హెచ్చరికలతో ఆ ప్రాతిపదనలపై వెనక్కి తగ్గారని వివరించారు. ఇప్పుడు రూటు మార్చి కేంద్రం అండతో గోదావరి-కావేరి నదుల అనుసంధానం పేరిట బనకచర్లకు మార్గం సుగమం చేసుకునేందుకు మూడో ప్రతిపాదనకు సిద్ధమయ్యారని వివరించారు. పోలవరం నుంచి బొల్లపల్లి, నాగార్జునసాగర్, సోమశిల ద్వారా కావేరికి నీళ్లు తరలించే ప్రణాళికలు సిద్ధం చేశారని, ఇది మొత్తంగా తెలంగాణ నదీజలాలను కబళించే కుట్ర అని వివరించారు. పోలవరం నుంచి కావేరికి నేరుగా కలిపే అనుసంధానంలో తెలంగాణను లేకుండా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటివరకు నీళ్లున్నా.. నీటి హకులున్నా రేవంత్ ప్రభుత్వం వినియోగించలేదని, ఇప్పుడు చంద్రబాబు ఏకంగా నీటి హకులే లేకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు.

కేంద్రానికి బాబు లేఖల మీద లేఖలు

గోదావరి జలాలను తరలించుకుపోయే లింకు విషయంలో చంద్రబాబు లేఖల మీద లేఖలు రాస్తున్నారని, ఢిల్లీలో మీటింగులకు అటెండవుతున్నారని, రేవంత్‌రెడ్డి మాత్రం రాతి బొమ్మలా నిలబడి చూస్తున్నాడని దుయ్యబట్టారు. 'గోదావరి-కావేరి లింకులో సమ్మక సాగర్ నుంచి నాగార్జునసాగర్ మీదుగా జలాలను తీసుకువెళ్లాలి. తెలంగాణకు సంబంధించి గోదావరిలో 968 టీఎంసీల నీటి హక్కులకు రక్షణ కల్పించాలి. ఆ నీటిలో చుక్క కూడా ముట్టుకోవద్దు. జీసీ లింకులో మళ్లించే జలాల్లో 50 శాతం వాటా ఇవ్వాలి. ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్ మీదుగా జీసీ లింకుకు కేంద్రం ఒప్పుకొన్నది. ఏ రాష్ట్రానికి ఎన్ని నీళ్లు అనేది నిర్ణయించింది.

రామాంతపూర్ జ్యువెల్లరీ వ్యాపారి కిడ్నాప్ కేసులో 9 మంది నిందితుల అరెస్ట్.. రూ. కోటి స్వాధీనం



హైదరాబాద్, అక్టోబర్ 17: నగరంలోని రామాంతపూర్‌కు చెందిన జ్యువెల్లరీ వ్యాపారి శ్రీనివాసరావు కిడ్నాప్ కేసును చిక్కడపల్లి పోలీసులు ఛేదించారు. ఈ మేరకు కేసుకు సంబంధించి 9 మంది నిందితులను అరెస్ట్ చేయగా.. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షితమూర్తి కేసు వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించారు.నగరంలోని రామాంతపూర్‌కు చెందిన శ్రీనివాసరావు అనే వ్యాపారిని కొందరు నిందితులు 2026 అక్టోబర్ 5న గోల్నాక ఫ్లైఓవర్ సమీపంలో కిడ్నాప్ చేశారు. పోలీసులమని నమ్మించి బాధితుడిని వాహనంలో ఎక్కించుకున్నారు. అనంతరం కళ్లకు గంతలు కట్టి గుర్తు తెలియని ప్రాంతంలో నిర్భంధించారు. బాధితుడి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి రూ.15 కోట్లు డిమాండ్ చేసి.. వారి నుంచి రూ.1.30 కోట్లు వసూలు చేశారు. అనంతరం బాధితుడిని నిర్మానుష్య ప్రదేశంలో వదిలేశారు. ఈ మేరకు ఫోన్ సిగ్నల్, సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా 9 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పాత కక్షలతోనే శ్రీనివాసరావును కిడ్నాప్ చేసినట్లు నిందితులు అంగీకరించారు.కాగా.. నిందితుల నుంచి రూ.1.07 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. దానితోపాటు సుమారు 97.09 గ్రాముల బంగారం, 3 గ్రాముల వెండి, బొలెరో, ఎర్టిగా, కియా సెల్టోస్ సహా ఐదు వాహనాలు సీజ్ చేసినట్లు వెల్లడించారు. నకిలీ నెంబర్ ప్లేట్లతో వాహనాలు మార్చుతూ పోలీసులకు చిక్కకుండా నిందితులు యత్నించినట్లు తెలిపారు. గతంలోనూ ఈ నిందితులపై కిడ్నాప్, దోపిడీ, మోసం కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు వెల్లడించారు.

హిందూపురం మున్సిపల్ చైర్మన్‌కు టీడీపీ కూటమి అభ్యర్థిగా పి.ఎస్. మంజునాథ్ నామినేషన్



హిందూపురం మున్సిపల్ చైర్మన్ పీఠానికి టీడీపీ కూటమి అభ్యర్థిగా పి.ఎస్. మంజునాథ్ నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ నమ్మకమే బలమని, అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. హిందూపురం మున్సిపల్ చైర్మన్‌కు టీడీపీ కూటమి అభ్యర్థిగా పి.ఎస్. మంజునాథ్ నామినేషన్ సత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు కూటమి శ్రేణులు సర్వం సిద్ధం చేశాయి. ఇందులో భాగంగా టీడీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పి.ఎస్. మంజునాథ్ ఘనంగా నామినేషన్ దాఖలు చేశారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, విజయం సాధించి తీరుతానని మంజునాథ్ ధీమా వ్యక్తం చేశారు.స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రానికి చేరుకుని, ఎన్నికల అధికారులకు అధికారికంగా తన నామినేషన్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ.. హిందూపురం పట్టణాభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, కూటమి అభ్యర్థిగా తనను గెలిపిస్తే పట్టణాన్ని అన్ని రంగాల్లోనూ మరింత ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఫ్రెయిర్ ఎనర్జీ బ్రాండ్ అంబాసిడర్‌గా రోహిత్



న్యూఢిల్లీ, అక్టోబర్ 17: భారత ప్రపంచకప్ విజేత కెప్టెన్ రోహిత్ శర్మ ఫ్రెయిర్ ఎనర్జీ సంస్థకు తొలి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. ఇంటి పైకప్పులపై సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటును ప్రోత్సహించే లక్ష్యంతో 'సోలార్ హో.. తో ఫ్రెయిర్ హో!' పేరుతో దేశవ్యాప్త ప్రచారాన్ని సంస్థ ప్రారంభించింది. ఈ ప్రచారంలో భాగంగా 'రిష్తా పక్కా' పేరుతో రూపొందించిన ప్రకటన చిత్రంలో రోహిత్ శర్మ నటించారు. సౌర విద్యుత్ ప్రయోజనాలు, ప్రభుత్వ రాయితీలు, దీర్ఘకాలిక సేవల అవసరాన్ని హాస్యభరితంగా వివరించేలా దీనిని రూపొందించారు. ఇంటిపై సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవడం దీర్ఘకాలిక నిర్ణయమని, అందుకు విశ్వసనీయమైన సంస్థను ఎంచుకోవాలని ప్రచారం ద్వారా సందేశమిస్తున్నారు.

24 వేలకుపైగా వ్యవస్థల ఏర్పాటు

2014లో స్థాపించిన ఫ్రెయిర్ ఎనర్జీ.. దేశవ్యాప్తంగా 40కిపైగా నగరాల్లో ఇళ్లు, వ్యాపార సంస్థలకు 24 వేలకుపైగా సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. రూపకల్పన, ఇన్‌స్టాలేషన్, ఆర్థిక సహాయం, నిర్వహణ సేవలను అందిస్తున్నట్లు తెలిపింది. ప్రధానమంత్రి సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన కింద అర్హత కలిగిన కుటుంబాలు గరిష్ఠంగా రూ.78 వేల వరకు ప్రభుత్వ సబ్సిడీ పొందవచ్చని సంస్థ పేర్కొంది. తక్కువ వడ్డీతో లభించే రుణ సదుపాయాలు ప్రారంభ పెట్టుబడి భారాన్ని తగ్గించగలవని వివరించింది.

పర్యావరణ పరిరక్షణకు మద్దతు : రోహిత్

పర్యావరణ పరిరక్షణ తనకు ఎంతో ముఖ్యమని రోహిత్ శర్మ తెలిపారు. కుటుంబాలు సౌర విద్యుత్‌ను స్వీకరించడం ద్వారా పర్యావరణానికి తమ వంతు సహకారం అందించవచ్చని పేర్కొన్నారు. విశ్వసనీయ భాగస్వామితో ఈ ప్రయాణం సాగించడం అవసరమని, మరిన్ని కుటుంబాలు స్వచ్ఛమైన, సుస్థిర ఇంధన వినియోగం వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసిన తర్వాత కూడా దీర్ఘకాలం సేవలందించడం ముఖ్యమని ఫ్రెయిర్ ఎనర్జీ సహ వ్యవస్థాపకులు సౌరభ్ మార్డా, రాధికా చౌదరి తెలిపారు. రోహిత్ శర్మతో భాగస్వామ్యం ద్వారా ఈ సందేశాన్ని దేశవ్యాప్తంగా మరిన్ని కుటుంబాలకు చేరవేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

అభిజీత్ దీప్కేకు కండిషనల్ బెయిల్ మంజూరు..

శాంతి ఒప్పందంపై సంతకం చేస్తేనే



సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కేకు ఢిల్లీకి చెందిన కోర్టు కండిషనల్ బెయిల్ మంజూరు చేసింది. అయితే, పీస్ బాండ్ మీద సంతకం చేయాలని కోర్టు ఆదేశించింది. దీప్కేను పోలీసులు శుక్రవారం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్, సెంట్రల్ పార్క్ వద్ద శుక్రవారం లెఫ్రో దో తిరంగా పేరుతో ర్యాలీకి పిలుపునిచ్చారు. అయితే, ఈ ర్యాలీకి వెళ్లకుండా దీప్కేను పోలీసులు అడ్డుకున్నారు. ఉద్రిక్తత తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యగా శుక్రవారం సాయంత్రం దీప్కేను పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీ, ఝుండేవాలన్ నుంచి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అలాగే, గత అక్టోబర్ 10న ఇచ్చిన బెయిల్ కండీషన్ ఉల్లంఘించినందుకుగాను అతడిని అరెస్టు చేశారు. దీప్కే అరెస్టును సవాలు చేస్తూ సీజేపీ న్యాయవాది రత్నా సింగ్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌ను శనివారం ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు దీప్కేకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గతంలో చెప్పినట్లు శాంతికి సహకరించాలని కోర్టు సూచించింది. దీని ప్రకారం పీస్ బాండ్‌పై సంతకం చేయాలని కోర్టు ఆదేశించింది.అలాగే, రూ.50,000 సెక్యూరిటీ బాండ్ కూడా సమర్పించాలని కోర్టు ఆదేశించింది. పీస్ బాండ్‌పై సంతకం చేయడంతోపాటు, సెక్యూరిటీ డిపాజిట్ సమర్పించిన అనంతరం దీప్కే విడుదలవుతారని ఢిల్లీ పోలీసులు తెలిపారు. మరోవైపు లెఫ్రో దో తిరంగా సందర్భంగా అరెస్టు చేసిన ఏఐఎస్ఏ నాయకురాలు నేహా బోరాను కూడా శనివారం పోలీసులు విడుదల చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ సీజేపీ కొద్ది రోజులుగా ఆందోళన చేస్తోంది.

ఎన్నికల వేళ రౌడీషీటర్ల హవా



విశాఖపట్నం, జీవీఎంసీ ఎన్నికల సమరం ఊపందుకుంటున్న వేళ నగరంలో రౌడీషీటర్లు, నేరచరిత్ర ఉన్న వ్యక్తుల కదలికలు రాజకీయ వర్గాల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. పలువురు నేరచరిత్ర ఉన్న వ్యక్తులను వెంట పెట్టుకుని కొందరు స్థానిక నాయకులు కార్పొరేటర్ టికెట్ల కోసం పార్టీలపై ఒత్తిడి తెస్తున్నారనే ప్రచారం సాగుతోంది. మరోవైపు ఎన్నికల బరిలోకి దిగుతున్న అభ్యర్థులను బెదిరించి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బర్మా క్యాంపు, నగర శివారు ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని కొందరు నేరచరిత్ర ఉన్న వ్యక్తులు ఒక వర్గంగా ఏర్పడి అభ్యర్థులపై ఒత్తిడి తెస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.తమకు డబ్బులు చెల్లించకపోతే ప్రచారానికి అడ్డంకులు సృష్టిస్తామని హెచ్చరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బర్మా క్యాంపులో 'పెద్దమనిషి'గా చలామణి అవుతున్న ఓ వ్యక్తి చుట్టూ రౌడీషీటర్ల కదలికలు పెరగడం చర్చనీయాంశంగా మారింది. సదరు వ్యక్తి గతంలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురు నిరుద్యోగ యువత నుంచి భారీగా డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. కుటుంబ, ఆస్తి వివాదాలను పరిష్కరిస్తానంటూ ఇరువర్గాల మధ్య జోక్యం చేసుకుని డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

ఆస్తులను హామీగా చూపించి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని తిరిగి చెల్లించకపోవడంతో ఆస్తుల స్వాధీనం కోసం బ్యాంకు అధికారులు ప్రయత్నిస్తున్నారనే ప్రచారం సైతం ఉంది.ఇదే సమయంలో స్థానిక ఎన్నికలను ఆసరాగా చేసుకుని భారీగా డబ్బులు వసూలు చేసేందుకు సదరు వ్యక్తి తన అనుచరులను రంగంలోకి దింపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన అభ్యర్థులు, మహిళా అభ్యర్థులు ఈ పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

ఓరుగల్లు అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం..



వరంగల్ వరంగల్, హనుమకొండ నగరాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. వరంగల్ మామునూరు విమానాశ్రయం, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. శనివారం నాయిని విశాల్ ట్రస్ట్, క్రెడాయ్ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రై సిటీస్ హాఫ్ మారథాన్--2026 రెండో ఎడిషన్‌కు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి 5కే రన్ ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ యువత ఆరోగ్యంపై దృష్టి సారించాలని, క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే గ్రామీణ ప్రాంత యువతకు తగిన అవకాశాలు కల్పించి, వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు.

'ట్రై సిటీస్ హాఫ్ మారథాన్' అభినందనీయం..

యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ కార్యక్రమం అభినందనీయమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, శారీరక వ్యాయామం, క్రీడలు, ధ్యానం ద్వారా ఒత్తిడి, ఆందోళన, ఇతర అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చని చెప్పారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ కోసం నాలుగు నుంచి ఐదు వేల మంది పాల్గొనేందుకు నమోదు చేసుకోవడం అభినందనీయం అన్నారు.

క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే ఉద్దేశ్యం..

యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంచడం, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే ఈ మారథాన్ ప్రధాన ఉద్దేశమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి కార్యక్రమానికి మరింత స్పందన లభించడం సంతోషకరమన్నారు. మారథాన్ విజయానికి సహకరించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, క్రెడాయ్ ప్రతినిధులు, స్పాన్సర్లు, నిర్వాహకులు, క్రీడాకారులు, యువతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి..

క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. యువతలో పెరుగుతున్న ఒత్తిడి, ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి క్రీడా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, డాక్టర్ శ్రీగోదా రెడ్డిలను అభినందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, మారథాన్ నిర్వాహకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రన్నర్లు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏలేశ్వరం నగర పంచాయతీ వైసీపీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా బదిరెడ్డి ఆశాలత

శంఖవరం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం నగర పంచాయతీ చైర్‌పర్సన్ పదవీ అభ్యర్థిత్వానికి బదిరెడ్డి ఆశాలత గోవిందును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థినిగా ఖరారు చేసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అధిష్ఠానం గురువారం అర్ధరాత్రి అధికారికంగా ఆమోదించిన నిర్ణయానికి అనుగుణంగా ఆశాలత అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముద్రగడ గిరిబాబు శుక్రవారం ప్రకటించారు. పార్టీ అధికారిక నిర్ణయాన్ని గమనించి, పార్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా నగర పంచాయతి సభ్యులు అందరూ తదుపరి కార్యక్రమాల్లో సమన్వయంతో వ్యవహరించి ఆశాలత విజయానికి కృషి చేయాలని ముద్రగడ గిరిబాబు ఆ ప్రకటనలో కోరారు.

రాజకీయ నేపథ్యం ... ప్రజాసేవలో అనుభవం ...

ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవం, స్థానిక రాజకీయాలపై అవగాహన, కుటుంబానికి ఉన్న రాజకీయ నేపథ్యం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సంపూర్ణ సహకారం ఆశాలత విజయానికి దోహదం చేస్తాయని భావిస్తున్నారు. బదిరెడ్డి ఆశలతకు గతంలో కౌన్సిలర్‌గా, అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యురాలిగా పనిచేసి అనుభవం ఉంది.అలాగే ప్రస్తుతం ఆమె ఏలేశ్వరం టౌన్ వైసిపి మహిళా అధ్యక్షురాలుగా పని చేస్తూ ప్రజా సమస్యలపై పట్టు సాధిస్తున్నారు. ప్రజా సమస్యలపై అవగాహనతో పాటు స్థానిక సంస్థల పాలనపై పరిచయం ఉండటం ఆమెకు కలిసివచ్చే అంశాలుగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. రమణమ్మలకు గత కౌన్సిల్లో కౌన్సిలర్లుగా పని చేసిన రాజకీయ నుభవం ఉంది.

ప్రకృతి పండుగ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు



వరంగల్
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయా లకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను నగర మహిళలందరూ ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న ఆకాంక్షించారు. ప్రకృతిని పూలతో పూజిస్తూ, మహిళల ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలు, సౌభాగ్యాలు నింపాలని, తెలంగాణ సంస్కృతి వైభవం తరతరాలకు కొనసాగాలని ఆయన ఆకాంక్షిస్తూ మహిళలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

పాత వస్తువుల బహిరంగ వేలంపాట నిర్వహణ .



వరంగల్ వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పాడైపోయిన పాత సామగ్రి విక్రయానికి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం బహిరంగ వేలంపాట నిర్వహించారు.పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు నేతృత్వంలోని కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలంలో సుమారు 40 మంది వ్యాపారులు పాల్గొన్నారు. వరంగల్ ఆటోనగర్‌కు చెందిన పటేల్ ఖాన్ పాత సామగ్రిని రూ.7,30,000 లకు వేలంపాట లో దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (ఏఆర్) సురేష్, ఏసీపీ (ఏఆర్) సురేంద్ర, అంతయ్య , ఆర్ఐ స్పర్జన్ రాజ్ లు పాల్గొన్నారు.

తెలంగాణ ఆడబిడ్డలందరికి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర.



వరంగల్
సద్దుల బతుకమ్మ పర్వదినం సందర్భం గా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలంగాణ ఆడబిడ్డలందరికి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన ఈ పండుగ సందర్భంగా ఆడబిడ్డలు ప్రకృతిని,పువ్వులను, గౌరమ్మను ఆరాధిస్తారని, బంధుమిత్రులతో కలిసి ఇష్టంగా, ఉత్సాహంగా, సంతోషంగా జరుపుకుంటారన్నారు.ఈ పండుగ చివరి రోజు తొమ్మిదవ రోజున ఆడబిడ్డలు తంగేడు,గునుగు,గుమ్మడి, బంతి,చామంతి తదితర తీరొక్క పూలతో ఆడబిడ్డలు బతుకమ్మలను ఆకర్షణీయంగా పేర్చి పిల్లాపాపలతో కలిసి ఆడిపాడుతా రన్నారు.అనాదిగా ఎంతో విశిష్టత కలిగిన ఈ పండుగ తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు అద్దం పడుతుందని ఎంపీ రవిచంద్ర తన సందేశంలో పేర్కొన్నారు.మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వాన ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమం సందర్భంగా బతుకమ్మ పండుగ ప్రజలను మరింత ఐకమత్యంతో ముందుకు నడిపించిందని ఆయన చెప్పారు.కేసీఆర్ పాలనలో ఈ పండుగను అధికారికంగా జరిపించారని,మరింత ప్రాచుర్యం తీసుకువచ్చారని.. ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభించడంతో ప్రఖ్యాత “ఆక్స్ ఫర్డ్”డిక్షనరీలో “బతుకమ్మ”పదం చేర్చబడిందని ఎంపీ రవిచంద్ర వివరించారు.ఈ విశిష్టమైన పండుగ సందర్భంగా రాష్ట్రంలోని లోని మహిళామణులు, దేశవిదేశాల్లో స్థిరపడిన, నివసిస్తున్న తెలంగాణ ఆడబిడ్డలందరికి ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

బెస్తంచెరువు చెరువు వద్ద సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను.

కమిషనర్ వెంకన్న తో కలిసి పరిశీలించిన.

మాజీ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్.




వరంగల్ బెస్తంచెరువు వద్ద జరిగే సద్దుల బతుకమ్మ పండుగకు కార్పొ రేషన్ పరంగా అన్ని ఏర్పాట్లను చేయాలని జిడబ్ల్యుఎంసీ కమిష నర్ టి వెంకన్న ను 42వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ కోరారు. సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని బెస్తం చెరువు వద్ద చేస్తున్న పనులను కార్పొరేషన్ కమిషనర్ టి వెంకన్న గారితో కలిసి 42 వడివిజన్ మాజీ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ పరిశీలించినారు. ఈ సందర్భంగా గుండు చందన పూర్ణచందర్ మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ పండుగకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, పూర్తిస్థాయిలో లైటింగ్ తో పాటు సౌండ్ సిస్టం లను ఏర్పాటు చేయాలని కమిషనర్ ను కోరారు. చెరువు చుట్టూ ప్రమాదవశాత్తు చెరువులో పడకుండా ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ వారిచే తాత్కాలిక ఫెన్సింగ్ తో పాటు భారీ కేడింగ్ ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు.కమిషనర్ టి వెంకన్న మాట్లాడుతూ ఈ ప్రాంతంలో చేస్తున్న పనులను ఆదివారం మధ్యాహ్నం వరకు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినారు. బతుకమ్మ ఆడుకోవడానికి వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు,ఎలక్ట్రికల్ డి ఈ సంతోష్, ఏఈ లు వరుణ్, గఫూర్, శానిటరీ ఇన్స్పెక్టర్ భీమయ్య, వర్క్ ఇన్స్పెక్టర్ వేణు లతోపాటు కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నరసింహారాములు అధికారులు, మున్సిపల్ జవాన్లు ప్రశాంత్, శ్రీధర్, కృష్ణ, ప్రణీత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన గంజి లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు

నేత్రదానం చేసి మరొకరికి చూపునిచ్చే మహత్తర నిర్ణయం

తల్లి మరణించిన విషాదంలోనూ నేత్రదానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులు

మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపే అవకాశం



నల్లగొండ నల్లగొండ జిల్లా, నల్లగొండ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన గంజి లక్ష్మమ్మ నేత్రదానం ద్వారా మానవత్వానికి ప్రతీకగా నిలిచారు. శుక్రవారం రాత్రి గుండెపోటుతో ఆమె ఆకస్మికంగా మృతి చెందగా, పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ ఆమె కుటుంబ సభ్యులు నేత్రదానానికి ముందుకు వచ్చి ఆదర్శంగా నిలిచారు. తమ తల్లి మరణించిన బాధలోనూ ఆమె నేత్రాలు మరొకరికి చూపునివ్వడానికి ఉపయోగప డతాయనే ఆశయంతో కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం పలువురికి స్ఫూర్తిదా యకంగా నిలిచింది.

కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాల సేకరణ

గంజి లక్ష్మమ్మ మరణించిన మరణించడంతో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ అగర్వాల్ ఐ బ్యాంక్ ప్రతినిధులను కుటుంబ సభ్యులు మరణానంతరం నేత్రాలను దానం చేయడం ద్వారా చూపు సమస్యలతో బాధపడుతున్న వారికి సహాయం చేసే అవకాశం ఉంటుందని గుర్తించి నేత్రదానాన్ని చేయాలనుకున్న లక్ష్మమ్మ కుమారుడు మురళితో పాటు ఇతర కుటుంబ సభ్యులు తమ తల్లి నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. తీరని దుఃఖంలో ఉన్నప్పటికీ, తమ తల్లి నేత్రాలు మరొకరి జీవితంలో వెలుగులు నింపేందుకు ఉపయోగపడతా యనే మంచి ఉద్దేశంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. కుటుంబ సభ్యుల అంగీకారం అనంతరం డాక్టర్ అగర్వాల్ ఐ బ్యాంక్ ప్రతినిధులు అవసరమైన వైద్య ప్రక్రియ ద్వారా లక్ష్మమ్మ నేత్రాలను సేకరించారు. ఈ విధంగా లక్ష్మమ్మ మరణానంతరం కూడా మరొకరికి ఉపయోగపడే అవకాశం కల్పిస్తూ ఆమె కుటుంబ సభ్యులు మానవత్వాన్ని చాటుకు న్నారు.

నేత్రదానం.. మరొకరి జీవితంలో వెలుగులు నింపే అవకాశం

నేత్రదానం అనేది మరణానంతరం ఇతరులకు చూపు కల్పించే అవకాశాన్ని అందించే గొప్ప సేవ. చూపు సమస్యలతో బాధపడుతున్న వారికి నేత్రదానం ద్వారా సహాయం అందించవచ్చనే అవగాహన సమాజంలో మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది.ఈ సందర్భంగా నేత్రదానం ప్రాముఖ్యతను వివరించిన ఐ బ్యాంక్ ప్రతినిధులు, మరణించిన వ్యక్తి నేత్రాలను దానం చేయడం ద్వారా అర్హులైన వారికి చూపు పొందే అవకాశాన్ని కల్పించవచ్చని పేర్కొన్నారు. నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెరిగితే మరింతమంది ఈ సేవకు ముందుకు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు.

విషాదంలోనూ ఆదర్శంగా నిలిచిన కుటుంబం

కుటుంబంలో ఒకరిని కోల్పోవడం ఎవరైనా తట్టుకో లేని విషాదం. అలాంటి సమయంలోనూ తమ తల్లి నేత్రాలను దానం చేయడానికి ముందుకొచ్చిన గంజి లక్ష్మమ్మ కుటుంబ సభ్యుల నిర్ణయం పలువురి ప్రశంసలు అందుకునేలా ఉంది. మానవత్వం, సేవాభావం, ఇతరుల జీవితాల్లో వెలుగు నింపాలనే ఆలోచనకు ఈ ఘటన ఉదాహరణగా నిలిచింది. గంజి లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు తీసుకున్న ఈ నిర్ణయం నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు దోహదప డుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరణానంతరం కూడా ఇతరులకు సహాయపడే అవకాశం ఉందనే సందేశాన్ని ఈ ఘటన సమాజానికి అందిస్తోంది. నేత్రదానం మహాదానం.. మన మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపే అవకాశం. గంజి లక్ష్మమ్మ కుటుంబ సభ్యుల నిర్ణయం ప్రతి ఒక్కరిలో సేవాభావాన్ని, మానవ త్వాన్ని పెంపొందించాలని ఆకాంక్షిద్దాం.

అత్యంత ప్రమాద దశలో ప్రజాస్వామ్యం

ప్రముఖ కవి, రచయిత ఎన్ తిర్మల్

నియంతృత్వంపై విరుచుకు పడ్డ కవితా స్వరాలు



ఖమ్మం రూరల్,అక్టోబర్ 17: ప్రజాస్వామ్యం అత్యంత ప్రమాద దశలో ఉందని ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్టు ఎన్.తిర్మల్ ఆంద ోళన వ్యక్తం చేశారు. కవి బుక్కా సత్యన్నారాయణ అధ్య క్షతన శనివారం సాయంత్రం రూరల్ మండలం పల్లె గూడెంలో వికాస వేదిక సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన “ప్రజాస్వామ్యమా వర్ధిల్లు !”అనే అంశం పై జరిగిన కవి సమ్మేళనం ప్రారంభించి, ఆయన ప్రసంగించారు. అంతర్జాతీయంగా ప్రజాస్వామ్య సూత్రాలు ఉల్లంఘన చేసి ప్రపంచ పోలీసులాగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంపు పచ్చి ప్రజాస్వామ్య వ్యతిరేకిగా యుద్ధోన్మాదిగా వ్యవహరిస్తూ ప్రపంచ దేశాలప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జాతీయంగా ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాధ ఘంటికలు కనిపిస్తున్నాయని అన్నారు. జంతర్ మంతర్ లాంటి ప్రదేశాల్లో నిరసన తెలిపే హక్కును కాలరాయడం చూస్తే ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఉందా అనిపిస్తుంది. స్వతంత్ర వ్యవస్థలను భ్రష్ట పట్టించి పాలకులు తమ రాజకీయ చదరంగంలో పావులుగా మార్చుకొని ప్రజాస్వామ్య హననానికి పాల్పడుతున్నాయన్నా రు. ఓటును సరళీకరణ చేయాలసిన ఎన్నికల కమిషన్ యస్ ఐఆర్ పేరుతో సంక్లిష్టం చేసిందని అన్నారు. రాష్ట్రంలో సైతం అదికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజల సమస్యలు గాలికి వదిలి అవినీతి, చీకటి కధల్లో మునిగి తేలుతున్నాయి, ప్రజాస్వామ్య హననం నుండి భవిష్యత్తు తరాలను కాపాడుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు.వికాసవేదిక గౌరవ సలహాదారు స్రృజన్ కుమార్ మాట్లాడుతూ ఆర్థిక, రాజకీయ,ఆరోగ్యం, సామాజికరిత్యా ప్రజాస్వామ్య హననం జరుగుతుందన్నారు. వికాసవేదిక రాష్ట్ర కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్ మాట్లాడుతూ కవులుగా మనం ప్రజాఉద్యమాలకు అండదండగా ఉండి ప్రజాస్వామ్య పరిరక్షణ బాధ్యత తీసుకొనక పోతే భవిష్యత్తుతరాలు ప్రమాదంలో పండుతాయన్నారు.”నా ఉనికి ఎక్కడ?”అన్న కవితతో కవి సమ్మేళనం ప్రారంబించి ప్రజాస్వామ్యం గాడి తప్పిన వైనం వివరించారు.బాలకవి జోసాయి తన కవితా శీర్షిక “ప్రజాస్వామ్యం వర్ధిల్లు”కవితా చదివి వినిపించారు. కవి రాజేంద్ర “నిష్పాక్షికంగా” అనే శీర్షిక నా రాసిన కవితలో పాలకుల నియంత్రృత్వాన్ని ప్రజలు తుడిచి పెడతారన్నారు. కవి యస్కే.సలాం తన కవిత “ప్రజాస్వామ్యమా వర్ధిల్లు”అనే కవితలో ధనస్వామ్యం ప్రజాస్వామ్యంకు ప్రమాదమని తన కవితలో వివరించారు. యువరచయిత గుడిసె రాజశేఖర్ తన కవిత”ఉదయిస్తూనే ఉన్న”అన్న కవితలో వివక్షతో కనీసం హక్కులు హరిస్తున్నారని అన్నారు.ఈకవి సమ్మేళనం లోకవి మోహియుద్దీన్ ,పంజాల ఐలయ్య, కొత్తపల్లి కృష్ణారావు, గరిడేపల్లి శోభనాద్రి,మందులు వీరభద్రం,చింత మళ్ళీ సునీత, రెంటాల చిన్న హుస్సేన్,తిరునగరి శ్రీనివాస్,యానిమేషన్ గండ్లరాజెందర్ తదితరులు ప్రజాస్వామ్యంపై కవితలు వినిపించారు. సభలోవికాసవేదిక సభ్యులు మల్లయ్య, రాజయ్యలు ఓటు చైతన్యం వివరిస్తూ పాటలు పాడారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సద్దుల బతుకమ్మ.

సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపిన .

వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య



వరంగల్ సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు, ముఖ్యంగా ఆడబిడ్డలకు హృద య పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవానికి బతుకమ్మ పండుగ ప్రతీక అని, ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ మన రాష్ట్ర ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెబుతుందని ఎంపీ పేర్కొన్నారు.తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆడబిడ్డలు ఆటపాటలతో, ఆనందోత్సాహాల మధ్య సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.సద్దుల బతుకమ్మ ప్రతి ఇంటా సంతోషాల సిరులు కురిపించాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని, తెలంగాణ సంస్కృతి వైభవం కలకాలం పరిఢవిల్లాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆకాంక్షించారు.

రెండు బంగారు పతకాలతో సత్తా చాటిన చరణ్ గౌడ్

జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు అర్హత

ఖమ్మం, నీలగిరి వార్త ప్రతినిధి, అక్టోబర్ 17: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 15న ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి 20వ జాతీయ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో వేములకొండ చరణ్ గౌడ్ ప్రతిభ కనబరిచాడు. పెంటాథ్లాన్, 80 మీటర్ల హర్డిల్స్ పోటీల్లో పాల్గొని రెండు బంగారు పతకాలు సాధించాడు. ఈ విజయంతో జాతీయస్థాయి(నేషనల్) జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడు. వికారాబాద్ జిల్లా సదాశివపేటలోని వోక్సల్ యూనివర్సిటీ ప్రాంగణంలో నవంబర్ 14 నుంచి 16 వరకు జరగనున్న జాతీయస్థాయి(నేషనల్) జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో చరణ్ గౌడ్ పాల్గొననున్నాడు. ప్రస్తుతం చరణ్ గౌడ్ ఖమ్మంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అకాడమీలో, సర్దార్ పటేల్ స్టేడియంలో తెలంగాణ సీనియర్ అథ్లెటిక్స్ కోచ్ మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నాడు. జిల్లాస్థాయి పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత పొందిన చరణ్ గౌడ్‌ను కోచ్ మహమ్మద్ గౌస్, కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది, గ్రామ పెద్దలు

లకుమారపు మల్లయ్య కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కల్వకుంట్ల కవిత

దేవరకొండ

దేవరకొండ పట్టణానికి చెందిన టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు లకుమారపు మల్లయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నివాసంలో శుక్రవారం జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత స్వయంగా కేకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు కోసం మల్లయ్య తనతో అహర్నిశలు కృషి చేశారని తెలిపారు ఆయన జన్మదినం మాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. మాతో ఆయన ప్రయాణం సుదీర్ఘకాలం నుండి కొనసాగుతుందని పార్టీ




ఆదేశాలను దేవరకొండ నియోజకవర్గం లో విస్తృత పరుస్తున్నారని పేర్కొన్నారు. మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని అన్నారు . కల్వకుంట్ల కవిత సమక్షంలో జన్మదినం జరుపుకోవడం సంతోషాన్ని ఇచ్చింది లకుమారపు మల్లయ్య మాట్లాడుతూ టిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నివాసంలో తనను ప్రత్యేకంగా ఆహ్వానించి ఆమె స్వయంగా కేకును కోసి తినిపించి శుభాకాంక్షలు తెలియజేయడం తాను ఎన్నటికీ మర్చిపోలేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గం ఇన్చార్జ్ నేనావత్ శివ నాయక్, తెలంగాణ యూనివర్సిటీల ఇన్చార్జి అశోక్ యాదవ్, సీనియర్ నాయకులు రూప్సింగ్ నాయక్ ,నల్ల మాస శ్రీకాంత్ గౌడ్, యూత్ నాయకుడు రాము తదితరులు పాల్గొని మల్లయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు .

జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులకు ఘన సన్మానం నియామకమైన గల్లా వెంకటేశ్వర్లు,పోతుల జ్ఞానయ్య.

హుజూర్ నగర్

రాష్ట్ర మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గల్లా వెంకటేశ్వర్లు,పోతుల జ్ఞానయ్య జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులుగా నియామకమైనారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎండి.అజీజ్ పాషా ఆధ్వర్యంలో జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులకు ఘనంగా సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోనూతనంగా ఎస్సీ,ఎస్టీ, విజిలెన్స్ కమిటీ ఏర్పాటు జరిగింది.ఈ కమిటీలో నియామకమైన గల్లా వెంకటేశ్వర్లు,పోతుల జ్ఞానయ్యకు శనివారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా శాలువాలు,పూల మాలలతో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, హుజూర్ నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గెల్లి రవి మాట్లాడుతూ జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులుగా నియామకం కావటం గర్వించదగ్గ విషయమని అన్నారు.జిల్లాలో ఉన్న అపరిష్కృత సమస్యలను పరిష్కరించా లని,ఎల్లవేళలా పార్టీ సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు,గోట్టే రామయ్య, అట్లూరి హరిబాబు,నర్సింగ్ వెంకటేశ్వర్లు,ఎంఏ అబ్దుల్ మజీద్ భాయ్,నమ్మెట సుబ్బరాజు,ముషం సత్యనారా యణ, కోలపూడి యోహాన్,తేజ సైదులు నాయక్, కోల నాగేశ్వరరావు,




పి.రామ్మూర్తి,బొడ్డు గోవిందరావు,కస్తాల దిల్,షేక్ బిక్కన్ సాబ్, కోలా మట్టయ్య,బంటు సైదులు,రాము రవి,రాములు,వీరబాబు,జ్యోతి,రజాక్ బాబా తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం చిరు వ్యాపారులకు 5 లక్షల రూపాయలు వడ్డీ లేని ఋణాన్ని అందచేయాలి

ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్

హుజూర్ నగర్

రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లోని (పెట్టి వెండర్స్) రోడ్డు ప్రక్కన చిరు వ్యాపారులకు,కేంద్ర ప్రభుత్వం ఐదులక్షల రూపాయల వడ్డీలేని ఋణాన్ని వెంటనే అందించాలని ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్ డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని వర్తక సంఘం మీటింగ్ హాల్లో హుజూర్ నగర్ పట్టణ చిరు వ్యాపారుల సమావేశం ఐ ఎన్ టి యు సి పట్టణ అధ్యక్షుడు మద్దం నాగేందర్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన యరగాని నాగన్న గౌడ్ మాట్లాడుతూ గత యూపీఏ ప్రభుత్వంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా చిరు వ్యాపారులకు స్వస్తియ యోజన పథకం ద్వారా రెండు



లక్షల ఋణాలను అందించే వారని,అట్టి ఋణాలను బిజెపి ప్రభుత్వం ముద్ర పథకం ద్వారా ప్రారంభించి దానిని పూర్తి స్థాయిలో అందించటంలో విఫలమవుతు ందని,అదే పథకాన్ని నేటి పరిస్థితుల వలన పేదల ఆర్థిక ఇబ్బందులు గుర్తించి వడ్డీ లేని ఋణంగా 5 లక్షల రూపాయలు అందించాలని డిమాండ్ చేశారు.పట్టణం లోని పేద కార్మికులకు అర్హులైన వారికి మంత్రి కెప్టెన్ ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో రామస్వామి గట్టు వద్ద ఇండ్లు ఇప్పిస్తామని తెలిపారు.అనంతరం యూనియన్ సభ్యత్వం ఫండును ఆయా సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొం డగురవయ్య,బ్లాక్ అధ్యక్షుడు చిట్యాల అమర్నాథరెడ్డి, చింతకాయల రాము,లక్క వెంకన్న, రబ్బాని.మోహిను భాష,రమణ,రూప,నగేష్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి ఎంపీపీ అభ్యర్థిగా రేసులో ఇండుగుల రామకృష్ణ

కొవ్వూరు

తాళ్లపూడి మండల రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకున్న ఈ పరిణామంలో, తాళ్లపూడి ఎంపీపీ అభ్యర్థిగా తాను బరిలో నిలవనున్నట్లు తాళ్లపూడి మండలం బిజెపి అధ్యక్షుడు ఇండుగుల రామకృష్ణ స్పష్టం చేశారు. కొవ్వూరులో జరిగిన బిజెపిపార్టీ సమావేశంలో ఆయన ఈ విషయాన్ని పార్టీ నాయకత్వానికి అధికారికంగా తెలియజేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిల్లలమర్రి మురళీకృష్ణతో పాటు పలువురు జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తాళ్లపూడి మండలంలో బీజేపీని మరింత బలోపేతం చేయడానికి, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతరం శ్రమిస్తానని వెల్లడించారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ తాళ్లపూడి అభివృద్ధికి కట్టుబడి ఉంటానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే నాయకులకు సముచిత ప్రాధాన్యత లభిస్తుందని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమర్థులైన అభ్యర్థులను బరిలో నిలిపి తాళ్లపూడి మండలంలో కమలం జెండాను ఎగరేస్తామని వారు ఈ సందర్భంగా విశ్వాసం వ్యక్తం చేశారు.



బౌవ్ సర్ క్షత్రియ సేవా కమిటీ ఆధ్వర్యంలో

కొనసాగుతున్న దుర్గామాత శరన్నవరాత్రులు

దేవరకొండ దేవరకొండ పట్టణంలోని బౌవ్ సర్ క్షత్రియ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత మండపం వద్ద శ్రీ దుర్గామాత శ్రీ సరస్వతి అవతారంలో దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా శు క్రవారం మహిళలు చిన్నారులు శ్రీ సరస్వతి దేవి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు నోటు బుక్స్ పెన్నులు అందించగా వేద పండితులచే పూజలు నిర్వహించారు .ప్రతిరోజు అమ్మవారి అలంకరణతో పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి శ్రీ సాయి సన్నిధిలో

మహాలక్ష్మీదేవి అవతారంలో అమ్మవారి దర్శనం



చింతపల్లి, దేవరకొండ , చింతపల్లి శ్రీ సాయి సన్ని ధిలో జరుగు తున్న శరన్నవరాత్రి ఉత్సవా ల్లో భాగంగా శనివారం శ్రీ మహాలక్ష్మీదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శ నమిచ్చారు. ఈ సందర్భం గా ఆలయంలో మహాల క్ష్మీదేవి హోమం, కుంకుమా ర్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అలాగే, శ్రీ సాయినాథుల వారి 108వ పుణ్యతిథి (సమాధి) ఉత్సవాలను పురస్కరించుకుని 108 కలశాలతో శ్రీసాయినాథులకు శుష్కఫలాలతో (డ్రై ఫ్రూట్స్) ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ విశేష పూజా కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తాయి. అనంతరం బంగారు లక్ష్మీ భగవతారిణి పార్వతీ కల్యాణం హరికథా గానం చేసి భక్తులను అలరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ సాయినాథుల వారి ఆశీస్సులు పొందారు.శ్రీ సాయి సన్నిధిలో నిర్వహించిన ఈ విశేష పూజలు, హరికథా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో

మహాలక్ష్మీదేవి అవతారంలో అమ్మవారి దర్శనం



దేవరకొండ దేవరకొండ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతు న్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండ మున్సిపాలిటీ 16వ వార్డు కౌన్సిలర్ కేతావత్ రూప్ల నాయక్ శనివారం తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు రూప్ల నాయక్ దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు. నీల రవికుమార్ ను సైతం శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రూప్ల నాయక్ మాట్లాడుతూ, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా విశేష పూజలు అందుకుంటున్న దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీల రవికుమార్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి

పంది అడ్డురావడంతో అదుపుతప్పిన బైక్.. అక్కడికక్కడే దుర్మరణం



చండూరు, అక్టోబర్ 17: చండూరు మండలం పుల్లెంల గ్రామపం చాయతీ కార్యదర్శి శ్రీపతి అంజయ్య (46) శనివారం విధులు ముగించు కుని బైక్‌పై స్వగ్రామమైన చల్మారెడ్డి గూడెం వెళ్తుండగా ఎస్ఎల్‌బీసీ సమీపంలో రోడ్డుపై పంది అడ్డురా వడంతో ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో అంజయ్య అక్కడికక్కడే మృతిచెందారు.అంజయ్య మృతితో సహచర ఉద్యోగులు, అధికారులు విషాదంలో మునిగిపోయారు. ఆయన మృతిపట్ల పలువు రు సంతాపం వ్యక్తం చేశారు. అంజయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

దసరా, బతుకమ్మ పండుగల ఎఫెక్ట్..

పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ చూశారా..?



దసరా, బతుకమ్మ పండగల నేపథ్యంలో జనాలు హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్తుండటంతో రాష్ట్రంలో పలు ప్రధాన రహదారులు రద్దీగా మారిపోయాయి. ప్రయాణికులు వెళ్తున్న వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ అవుతోంది. సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో వెళ్తున్న వాహనాలు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ జాతీయ రహదారి 65పై పంతంగి టోల్ ప్లాజా వద్ద భారీగా నిలిచిపోయాయి.పండుగల నేపథ్యంలో రద్దీ మరింత ఎక్కువగా పెరుగకముందే ట్రాఫిక్ పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాల వెంబడి వాహనాలు పంపిస్తూ ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు. చౌటుప్పల్ ఫ్లైఓవర్ల నిర్మాణంతో సర్వీసు రోడ్డుపై వాహనాలు నెమ్మదిగా ముందుకు కదులుతున్నాయి.ఫాస్టాగ్ బ్యాలెన్స్ లేకపోవడం, సాంకేతిక సమస్యలు కూడా టోల్ ప్లాజా వద్ద రద్దీకి మరో కారణం అని అధికారులు చెబుతున్నారు. ఇక రద్దీని దృష్టిలో ఉంచుకొని చౌటుప్పల్ పరిధిలోని లక్కారం నుంచి వలిగొండ మార్గం మీదుగా చిట్యాలకు చేరుకునేలా వాహనాలను ట్రాఫిక్ పోలీసులు దారి మళ్లిస్తున్నారు. మరోవైపు పంతంగి టోల్ ప్లాజా వద్ద విజయవాడవైపు వెళ్లే వాహనాలు భారీ సంఖ్యలో టోల్ ప్లాజా వద్ద ఆగాయి.

నేను ట్రీట్‌మెంట్ చేయిస్తా.. బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న వినయ్‌కు కేటీఆర్ భరోసా.. వీడియో



బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడికి నేనున్న అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. నేను నీకు అండగా ఉంటా.. భయపడకు అంటూ భరోసానిచ్చారు.ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నరసింహులగూడెం గ్రామానికి చెందిన కర్నె ఆదినారాయణ, అనిత దంపతుల 13 ఏళ్ల కుమారుడు కర్నె వినయ్ ప్రస్తుతం బ్రెయిన్ క్యాన్సర్‌తో పోరాడుతున్నాడు. కేటీఆర్‌ను కలవాలని, ఆయనతో ఒక ఫోటో దిగాలన్నది వినయ్ కోరిక. అయితే స్థానిక నేతల ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ వెంటనే వినయ్ పరిస్థితిని, అతడి కోరికను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కందాల ఉపేందర్ వినయ్ కుటుంబసభ్యులను కేటీఆర్‌ను కల్పించారు.ఈ సందర్భంగా కేటీఆర్ హాయ్ వినయ్ అని ఆప్యాయంగా పలకరించారు. ఎన్నో క్లాస్ చదువుతున్నవ్ అని అడిగితే ఎనిమిదో తరగతి అని చెప్పాడు వినయ్. ఏం కాదు.. మంచిగైతవ్.. బాధపడకు.. మందులేసుకో.. నేను ట్రీట్‌మెంట్ చేయిస్తా.. అని గిఫ్ట్ ప్యాక్‌ను వినయ్‌కు అందించారు కేటీఆర్. ఏం బాధపడొద్దమ్మా.. వినయ్‌కు ఉత్తమ వైద్యం అందించేలా ప్రయత్నం చేస్తాం.. అంటూ వినయ్ తల్లిదండ్రులకు హామీనిచ్చారు. బాలుడికి అవసరమైన మెరుగైన వైద్య సహాయం అందేలా చూస్తామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

నిరసనల సందర్భంగా మహిళలపై లైంగిక హింస..

సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు, సర్‌కు వ్యతిరేకంగా కొద్ది రోజులుగా ఢిల్లీలో ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. సీజేపీతోపాటు ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ పార్టీ, ఇండియా బ్లాక్, ఇతర విద్యార్థి సంఘాలు ఇందులో పాల్గొంటున్నాయి. ఈ ఆందోళనల్లో భారీగా మహిళలు కూడా పాల్గొంటున్నారు. అయితే, వీరిలో చాలామందిపై లైంగిక దాడి, హింస జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి.ఇందుకు సంబంధించి కొన్ని వీడియోలు కూడా సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్నాయి. శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా చేపడతున్న నిరసనల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక దాడిని నిరసిస్తూ పలు మహిళా సంఘాలు ర్యాలీ నిర్వహించాయి. ఢిల్లీలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు పలు మహిళా సంఘాల ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ జరిగింది. ఇలా ఆందోళనకారులపై దాడి చేయడం సిగ్గుచేటు అంటూ వారు నినదించారు.

ఈ ర్యాలీలో ఐద్వా ఐప్వా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఏఐఎంఎస్ఎస్ఎస్ఎఫ్ఐ వంటి సంస్థలు పాల్గొన్నాయి. ఢిల్లీ పోలీసులకు వ్యతిరేకంగా వారు నినదించారు. మహిళలపై హింస, లైంగిక హింసను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. మహిళా జర్నలిస్టులపై కూడా కొందరు అసభ్యంగా

ప్రవర్తించినట్లు ఆరోపించారు. గురుద్వారా బంగ్లా సాహిబ్ నుంచి ఢిల్లీ పోలీసుల ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి పోలీసు ఉన్నతాధికారులకు మెమోరాండం సమర్పించారు. ఈ మేరకు కొన్ని వీడియో ఆధారాల్ని కూడా వారు సమర్పించారు.

13 కోట్ల ఓట్లను తొలగించారు..

హైదరాబాద్, అక్టోబర్ 17: ప్రస్తుతం భారతదేశం అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిలో ఉందని.. అందరూ కలిసి కట్టుగా పోరాటం చేయాలని ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఈరోజు(శనివారం) మీడియాతో మాట్లాడుతూ.. 2014లో మోదీ ప్రధాని అయ్యాక రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ రక్షణ కోసం 2017లో రాహుల్ గాంధీ ప్రొఫెషనల్ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. రాజ్యాంగాన్ని రక్షించాలంటే ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పాత్ర కీలకమని చెప్పుకొచ్చారు. ఇతర పార్టీలో ఉన్న వారు కూడా ప్రొఫెషనల్ కాంగ్రెస్‌లో భాగం పంచుకోవచ్చని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సభ్యత్వంలేని వారు కూడా రాజ్యాంగ పరిరక్షణ కోసం పని చేయొచ్చని అన్నారు.

నీరు లేక.. బోటింగ్ సాగక!

మున్సిపల్ ఎన్నికలు.. మేయర్ అభ్యర్థులపై ఉత్కంఠ.. సీఎం నిర్ణయం

దేశంలో 'సర్ ద్వారా 13 కోట్ల ఓట్లను మోదీ ప్రభుత్వం తొలగించిందని మధుయాష్కీ ఆరోపించారు. 13 కోట్ల ఓట్లలో ఎక్కువ మంది దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓట్లు ఉన్నాయన్నారు. తొలగించిన 13 కోట్ల ఓట్లు ఆధారాలతో బయటపెట్టామని అన్నారు. ూ×=పై పోరాటం కాంగ్రెస్ భవిష్యత్తు కోసం కాదని.. దేశ ప్రజల భవిష్యత్తు కోసమని స్పష్టం చేశారు. బీజేపీ మోదీ ప్రభుత్వం పౌరుల స్వేచ్ఛను కాలరాస్తోందని విమర్శించారు. క్లిష్ట సమయంలో తనకు అప్పజెప్పిన ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు.

మనోహ్మన్ సింగ్ ఫెలోషిప్ ద్వారా వివిధ రంగాల్లో వచ్చిన నిష్ణాతులైన 50 మందికి ఒక సంవత్సరం పాటు ట్రైనింగ్ ఇచ్చారని మాధుయాష్కీ తెలిపారు. రెండో దఫా 800 అప్లికేషన్స్ వచ్చాయని.. 100 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. బారిస్టర్లు, లాయర్లు, డాక్టర్లతో ప్రొఫెషనల్ కాంగ్రెస్ ఏర్పడిందన్నారు. భారత పౌరులకు రక్షణ కల్పించేది రాజ్యాంగమన్నారు. ప్రొఫెషనల్స్‌కు క్రెడిబులిటి



ఉండాలని రాహుల్ గాంధీ ఆకాంక్ష అని చెప్పుకొచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకరావడంలో ప్రొఫెషనల్స్ కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఇప్పుడున్న క్లిష్ట పరిస్థితుల కోసం ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పని చేస్తోందన్నారు. ప్రజలకు, ప్రతి పౌరుడికి గౌరవ ప్రదమైన జీవితం అందించడానికి ప్రొఫెషనల్ కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుందని తెలిపారు. నిష్ణాతులతో ప్రొఫెషనల్ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు చేశామని మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు.

బలవంతంగా యువతిని ముద్దు పెట్టుకున్న వ్యక్తి

లక్నో: బైక్‌పై వెళ్లేందుకు సిద్ధమవుతున్న యువతిని ఒక వ్యక్తి బలవంతంగా ముద్దుపెట్టుకున్నాడు. ప్రతిఘటించిన ఆమె అదుపు తప్పి బైక్ నుంచి కిందపడింది. ఆ వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. అయితే అదుపులోకి తీసుకున్న ఆ వ్యక్తిని పోలీసులు విడిచిపెట్టినట్లు యువతి పేరెంట్స్ ఆరోపించారు.) ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అక్టోబర్ 10న మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఒక యువతి బైక్‌పై వెళ్తున్నది. అయితే బరోలీ మార్కెట్ సమీపంలోని వీధి మలుపులో ఆ బైక్ అకస్మాత్తుగా ఆగిపోయింది. స్టార్ట్ చేసేందుకు ఆ యువతి ప్రయత్నిస్తుండగా ఒక వ్యక్తి వెనుక నుంచి వచ్చి ఆమెను పట్టుకున్నాడు. బలవంతంగా ముద్దు పెట్టుకున్నాడు. ఆ యువతి తీవ్రంగా ప్రతిఘటించింది. ఈ నేపథ్యంలో అదుపుతప్పిన ఆమె బైక్‌తో పాటు కిందపడిపోయింది. ఆ వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడుకాగా, ఈ సంఘటన తర్వాత యువతి తల్లిదండ్రులు వెంటనే అత్యవసర హెల్ప్‌లైన్ ద్వారా పోలీసులను సంప్రదించారు. దీంతో వారు అక్కడకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. నిందితుడిని గణేష్ శర్మ అలియాస్ గుడ్డుగా గుర్తించారు. అతడ్ని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.మరోవైపు పోలీసులు నిందితుడికి చలాన్ జారీ చేసి కొన్ని గంటల్లోనే విడుదల చేశారని యువతి కుటుంబ సభ్యులు ఆరోపించారు. అతడిపై పోక్సో చట్టం లేదా ఇతర సెక్షన్ల కింద ఎలాంటి కేసు నమోదు చేయలేదని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నిందితుడ్ని తిరిగి అరెస్ట్ చేసినట్లు తెలుస్తున్నది. అలాగే నిర్లక్ష్యం వహించిన పోలీస్‌పై చర్యలు



చేపట్టినట్లు సమాచారం.

ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

ఏఐపై అతిగా ఆధార పడుతున్న యువత..

•మానసిక ఆరోగ్యం

• ఏఐపై అతిగా ఆధార పడుతున్న యువత.. •మానసిక ఆరోగ్యం దెబ్బ తింటుందని నిపుణుల హెచ్చరిక..



కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో, దానిపై అతిగా ఆధారపడడం యువత మానసిక ఆరోగ్యానికి కొత్త సవాలుగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రచనలు చేయడం, సందేహాలకు సమాధానాలు తెలుసుకోవడం, వ్యక్తిగత సమస్యలపై సలహాలు తీసుకోవడం, భావోద్వేగ పరమైన తోడ్పాటు పొందడం వంటి అవసరాల కోసం చాలామంది ఏఐ చాట్‌బాట్‌లను ఆశ్రయిస్తున్నారు. గతంలో ఆహారం, సంస్కృతి, కథనాలపై ఆసక్తిగా రచనలు చేసిన ఓ యువ రచయిత.. ఇప్పుడు ఏఐ సహాయం లేకుండా రాయలేకపోతున్నానని చెప్పడం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. అయితే, ఏఐని తరచూ ఉపయోగించడం మాత్రమే వ్యసనంగా భావించకూడదు. దాని సహాయం లేకుండా పని చేయలేకపోవడం, నిర్ణయాలు తీసుకోలేకపోవడం లేదా భావోద్వేగాలను నియంత్రించలేకపోవడం వంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆందోళన చెందాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఏఐ చాట్‌బాట్‌ల పట్ల ఆకర్షణ..

యువతకు చిన్నప్పటి నుంచే డిజిటల్ సంభాషణలు, ఆన్‌లైన్ సమాచార వినియోగం అలవాటుగా మారడంతో ఏఐ చాట్‌బాట్‌లకు త్వరగా ఆకర్షితులవుతున్నారని నిపుణులు వివరిస్తున్నారు. తక్షణమే సమాధానాలు అందించడం, వ్యక్తిగతంగా స్పందిస్తున్నట్లు అనిపించడం వల్ల వాటిపై నమ్మకం పెరుగుతోంది. గణిత సమస్యలకు సరైన సమాధానాలు ఇచ్చే ఏఐ, వ్యక్తిగత సంబంధాలు, భావోద్వేగ సమస్యలపైనా సరైన సలహా ఇస్తుందని కొందరు భావిస్తున్నారు. కానీ ఒక సమాధానం స్పష్టంగా, నమ్మకంగా కనిపించినంత మాత్రాన అది సరైనదని చెప్పలేం. పదేపదే ఏఐ నుంచే ధైర్యం, ఆమోదం, సాంగత్యం కోరుకోవడం.. మనుషులతో మాట్లాడడం కంటే చాట్‌బాట్‌తో సంభాషించడమే సులభంగా అనిపించడం భావోద్వేగ పరమైన ఆధారపడడానికి సంకేతాలు అవుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఒంటరితనం, సామాజిక భయం ఎదుర్కొంటున్నవారికి ఇది తాత్కాలిక ఉపశమనం కలిగించినా, నిజ జీవిత సంబంధాల్లో ఎదురయ్యే భిన్నాభిప్రాయాలు, నిరాశ, అనిశ్చితిని ఎదుర్కొనే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశాలు తగ్గుతాయి. సృజనాత్మకతపై ప్రభావం..ఏఐపై అధికంగా ఆధారపడడం సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, స్వతంత్ర నిర్ణయ సామర్థ్యంపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రచనలకు ఆలోచనలు రూపొందించడం, సమాచారాన్ని క్రమబద్ధీకరించడం, వాదనల్లో లోపాలను గుర్తించడం వంటి పనుల్లో ఏఐ సహాయకరంగా ఉంటుంది.

అయితే, ఏఐ ఇచ్చిన సమాధానాలను ప్రశ్నించకుండా స్వీకరిస్తూ, స్వయంగా ఆలోచించడం, విశ్లేషించడం, కొత్త ఆలోచనలు అభివృద్ధి చేసుకోవడం వంటి ప్రక్రియలను పక్కనపెడితే నేర్చుకునే అవకాశాలు తగ్గుతాయి. నిద్ర, ఉద్యోగం, చదువు లేదా కుటుంబ బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తూ గంటల తరబడి చాట్‌బాట్‌లతో గడపడం, స్నేహితులు, కుటుంబ సభ్యులకు దూరమవడం, ఏఐ అందుబాటులో లేనప్పుడు ఆందోళన చెందడం, సాధారణ నిర్ణయాలకూ దాని ఆమోదం కోరుకోవడం వంటి లక్షణాలను గమనించాలని సూచిస్తున్నారు. అయితే, ఏఐ వినియోగం వల్ల మెదడు పనితీరు లేదా సృజనాత్మకత తప్పనిసరిగా దెబ్బతింటాయని నిర్ధారించే ఆధారాలు ఇంకా సరిపోవు. దాని దీర్ఘకాలిక ప్రభావాలపై మరింత పరిశోధన అవసరమని స్పష్టం చేస్తున్నారు.అవగాహన పెంచడం అవసరం.. భారత్‌లో యువత సంఖ్య అధికంగా ఉండడం, మానసిక ఆరోగ్య నిపుణుల సేవలు అందరికీ సులభంగా అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో ఈ అంశంపై అవగాహన పెంచడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. సహాయం కోరడానికి సంకోచించే వారికి ఏఐ ఒక ప్రారంభ మార్గంగా ఉపయోగపడుతుంది. అయితే, అది వైద్య నిర్ధారణ చేస్తుందని, మానసిక సమస్యల తీవ్రతను కచ్చితంగా అంచనా వేస్తుందని లేదా సరైన చికిత్స అందిస్తుందని భావించకూడదు. పాఠశాలలు, కళాశాలలు ఏఐ ప్రయోజనాలు, పరిమితులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి.

తల్లిదండ్రులు పిల్లలను తప్పుపట్టడం లేదా శిక్షించడం కంటే, వారు ఏఐని ఎందుకు ఆశ్రయిస్తున్నారో తెలుసుకుని వారితో బహిరంగంగా మాట్లాడాలి. రోజువారీ జీవితంపై మానసిక సమస్యలు ప్రభావం చూపుతున్నప్పుడు అర్హత కలిగిన నిపుణుల సహాయం తీసుకోవాలి. ఏఐని పూర్తిగా తిరస్కరించడం లక్ష్యం కాకూడదు, దానిని నేర్చుకోవడానికి, సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి ఉపయోగించుకుంటూనే, స్వతంత్రంగా ఆలోచించడం, నిజ జీవిత సంబంధాలను కొనసాగించడం, అవసరమైనప్పుడు మనుషుల నుంచి సహాయం పొందడం కీలకమని నిపుణులు పేర్కొంటున్నారు.



యూపీఐపై ఎండీఆర్ ప్రభావం..

దేశవ్యాప్తంగా కోట్లాది మంది రోజువారీ చెల్లింపులకు ఉపయోగిస్తున్న యూపీఐ వ్యవస్థలో అక్టోబర్ 15 నుంచి కీలక మార్పు రానుంది. రూ.2,000కు మించిన కొన్ని పర్సన్ టు మర్చంట్ (పి2వీ) చెల్లింపులపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (వీణ=) అమల్లోకి రానుంది. ఈ ఛార్జీని నేరుగా వినియోగదారుల నుంచి వసూలు చేయరాదని వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, దీనిపై దేశవ్యాప్తంగా వ్యాపారుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో 291 జిల్లాల్లో 67 వేల మందికి పైగా పాల్గొన్నారు. ఓ వ్యాపారి అదనపు రుసుము వసూలు చేస్తే వినియోగదారులు ఏం చేస్తారనే సర్వే ప్రకారం.. 31,206 మందిలో కేవలం 14 శాతం మంది మాత్రమే అదనపు ఖర్చును భరించి యూపీఐని కొనసాగిస్తామని చెప్పారు. 27 శాతం మంది ఎండీఆర్ చెల్లించేందుకు సిద్ధంగా లేమని, బదులుగా నగదు చెల్లిస్తామని పేర్కొన్నారు. 26 శాతం మంది క్రెడిట్ కార్డును ఎంచుకుంటామని, 14 శాతం మంది డెబిట్ కార్డును ఉపయోగిస్తామని తెలిపారు. 4 శాతం మంది బ్యాంక్ ట్రాన్స్‌ఫర్, చీజుఖీ లేదా ×వీూ వైపు వెళ్తామని వెల్లడించారు. 9 శాతం మంది అదనపు ఛార్జీ లేని మరో చెల్లింపు మార్గాన్ని అడుగుతామని చెప్పారు. 2 శాతం మంది కొనుగోలును వాయిదా వేస్తామన్నారు.

డయాబెటిస్ ఉన్నవారు పండ్లను తినే విషయంలో ఈ సూచనలు పాటించాలి.. షుగర్ లెవల్స్ పెరగవు..



మధుమేహం ఉన్నవారు పండ్లలో సహజ చక్కెర ఉంటుందని వాటిని తినడానికి భయపడుతుంటారు. అయితే పండ్లలో కార్బోహైడ్రేట్లతోపాటు శరీరానికి అవసరమైన పోషకాలు, పీచు పదార్థం కూడా ఉంటాయి. ముఖ్యంగా పండ్లను రసం రూపంలో కాకుండా పూర్తిగా తినడం వల్ల అందులోని పీచు చక్కెర రక్తంలోకి వేగంగా చేరకుండా జీర్ణక్రియను నెమ్మదింపజేస్తుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగే ప్రమాదం తగ్గుతుంది. అయితే అన్ని పండ్ల ప్రభావం ఒకేలా ఉండదు. మధుమేహం ఉన్నవారు పండ్ల రకం, పరిమాణంపై శ్రద్ధ పెట్టడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

జామ పండు, బెర్రీలు..

మధుమేహం ఉన్నవారికి జామపండు మంచి ఎంపికగా పేర్కొంటున్నారు. ఇందులో పీచు అధికంగా ఉండడంతోపాటు విటమిన్ సి కూడా సమృద్ధిగా ఉంటుంది. స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, రాస్ప్‌బెర్రీ వంటి బెర్రీల్లో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, కరిగే పీచు అధికంగా ఉండి చక్కెర తక్కువగా ఉంటుంది. పియర్‌లో పీచు ఎక్కువగా ఉండడంతో రక్తంలోకి చక్కెర నెమ్మదిగా విడుదల కావడానికి సహాయపడుతుంది. యాపిల్‌ను తొక్కతో తినడం వల్ల పీచు, ఇతర పోషకాలు ఎక్కువగా లభిస్తాయి. నారింజలో పీచు, విటమిన్ సి, పొటాషియం ఉంటాయి. అయితే నారింజ రసాన్ని తీసుకోవడం కంటే పండును పూర్తిగా తినడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

కివి, బొప్పాయి..

కివిలో విటమిన్ సి, విటమిన్ ఇ, పొటాషియం, పీచు ఉంటాయి. పరిమితంగా తీసుకుంటే రక్తంలో చక్కెర నెమ్మదిగా పెరిగే అవకాశం ఉంటుంది. బొప్పాయిలో యాంటీఆక్సిడెంట్లు, సహజ ఎంజైములు ఉంటాయి. అయితే సహజ చక్కెరలు ఉండడంతో పరిమాణంపై నియంత్రణ అవసరం. దానిమ్మలో యాంటీఆక్సిడెంట్లు, ఇనుము ఉన్నప్పటికీ ఇతర కొన్ని పండ్లతో పోలిస్తే సహజ చక్కెర ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పరిమితంగా తీసుకోవాలి. మామిడిపండులో సహజ చక్కెర, గ్లైసెమిక్ సూచీ ఎక్కువగా ఉండడంతో చాలా తక్కువ పరిమాణంలో తీసుకోవాలని సూచిస్తున్నారు. ద్రాక్షను కూడా సులభంగా ఎక్కువగా తినే అవకాశం ఉంటుంది కాబట్టి మధుమేహం ఉన్నవారు పరిమాణాన్ని నియంత్రించాలి.

తాజా పండ్లను తినాలి..

మధుమేహం ఉన్నవారు పండ్ల రసాలు లేదా ఎండబెట్టిన పండ్లకు బదులుగా తాజా పండ్లను పూర్తిగా తినడం మంచిది. ఒకేసారి ఎక్కువ పండ్లు తినకుండా చిన్న పరిమాణాల్లో తీసుకోవాలి. పండ్లను గింజలు, పెరుగు వంటి ప్రొటీన్ ఉన్న ఆహారంతో లేదా ఆరోగ్యకరమైన కొవ్వులతో కలిపి తీసుకోవడం ద్వారా రక్తంలో చక్కెర నియంత్రణకు తోడ్పడుతాయి. బెర్రీలు, చెర్రీలు, యాపిల్ వంటి తక్కువ గ్లైసెమిక్ సూచీ కలిగిన పండ్లను ఎంచుకోవచ్చు. యాపిల్, పియర్ వంటి పండ్లను వీలైనంత వరకు తొక్కతో తినడం ద్వారా అదనపు పీచు లభిస్తుంది. ఏ పండు తిన్న తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలో ఎలాంటి మార్పు వస్తుందో గమనించడం కూడా ఉపయోగకరంగా ఉంటుంది. మధుమేహం ఉన్నవారు పండ్లను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని, సరైన పరిమాణంలో, జాగ్రత్తగా ఎంచుకుని తీసుకోవడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

రూ. 9లక్షల కోట్లు ఆవిరి..

భారీ నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు..



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,000 పాయింట్లకు పైగా పతనమైంది. నిఫ్టీ 50 సూచీ 22,300 స్థాయికి దిగువకు జారింది. బీఎస్ఈలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ విలువలో దాదాపు రూ.9 లక్షల కోట్ల మేర తగ్గుదల కనిపించింది. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, అమెరికా బాండ్ రాబడులు పెరగడం, ముడి చమురు ధరలపై ఆందోళనలు మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు మరోసారి అమ్మకాల బాట పట్టడం మార్కెట్‌పై ప్రభావం చూపింది. సెప్టెంబర్ 30న విదేశీ మదుపర్లు దాదాపు రూ.10,148 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ఇది గత ఆరు నెలల్లో ఒకే రోజులో నమోదైన అతిపెద్ద విదేశీ పెట్టుబడి ఉపసంహరణ 2. అమెరికా బాండ్ రాబడుల పెరుగుదలఅమెరికా 10 సంవత్సరాల ప్రభుత్వ బాండ్ ఈల్డ్ సుమారు 5.3 శాతానికి చేరడం కూడా భారత మార్కెట్లపై ప్రభావం చూపింది. అమెరికా బాండ్లలో రాబడులు పెరిగినప్పుడు అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో పెట్టుబడులపై ఆకర్షణ తగ్గుతంది. దీంతో విదేశీ పెట్టుబడిదారులు భారత ఈక్విటీల నుంచి నిధులను వెనక్కి తీసుకుంటున్నారు. 3.ముడి చమురు ధరలపై ఆందోళనలు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, సరఫరాకు సంబంధించిన ఆందోళనలు చమురు మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. ముడి చమురు ధరలు పెరగడం భారత్‌పై తీవ్ర ఒత్తిడి కలిగిస్తాయి. చమురు ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం, దిగుమతి వ్యయం, కంపెనీల లాభాలపై ప్రభావం పడుతుందనే ఆందోళన పెట్టుబడిదారుల్లో ఉంటుంది (ూవఅంవఇ చీఱట్ఎ ఖీఘశ్రీశ్రీ). 4. అన్ని రంగాలకూ అమ్మకాల ఒత్తిడి ఈ మార్కెట్ పతనం అన్ని రంగాలనూ దెబ్బతీసింది. ఆటో, మెటల్స్, రియల్టీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ తదితర రంగాల్లో కూడా భారీ అమ్మకాలు కనిపించాయి. నిఫ్టీ ఆటో సూచీ 4 శాతానికి పైగా పడిపోయింది. మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతి సుజుకి, టాటా స్టీల్ వంటి ప్రముఖ షేర్లు కూడా గణనీయంగా నష్టపోయాయి

ప్రసవం తరువాత సాధారణ శరీరాకృతి వచ్చేందుకు ఎంత సమయం పడుతుంది..

ప్రసవం తర్వాత మహిళలు త్వరగా గర్భధారణకు ముందు ఉన్న శరీరాకృతికి తిరిగి రావాలనే ఒత్తిడి ఇటీవలి కాలంలో పెరిగింది. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో ప్రముఖుల శరీర మార్పులను ఆధారంగా చేసుకుని కొత్తగా తల్లైన మహిళలపై అంచనాలు పెడుతున్నారు. అయితే గర్భధారణ, ప్రసవం తర్వాత శరీరంలో గణనీయమైన హార్మోన్ల, శారీరక మార్పులు చోటుచేసుకుంటాయి. అందువల్ల వెంటనే మునుపటి శరీరాకృతికి తిరిగి రావడం సాధ్యం కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. గర్భధారణకు ముందు ఉన్న బరువుకు చేరుకోవడానికి కనీసం ఆరు నెలలు లేదా అంతకంటే ఎక్కువ సమయం పడుతుందని, ప్రతి మహిళ శరీరం, కోలుకునే విధానం భిన్నంగా ఉంటాయని వివరిస్తున్నారు.

తొలి 6 వారాలు కీలకం..


ప్రసవం తర్వాత తొలి ఆరు వారాలు



లేదా సుమారు 40 రోజులను కీలకమైన కోలుకునే దశగా పరిగణిస్తారు. ఈ సమయంలో హార్మోన్లలో మార్పులు, పాలిచ్చే ప్రక్రియ, ప్రసవం వల్ల శరీరంలో చోటుచేసుకున్న మార్పులకు శరీరం క్రమంగా అలవాటు పడుతుంది. గర్భధారణ సమయంలో పెద్దదైన గర్భాశయం మళ్లీ సాధారణ పరిమాణానికి చేరుకోవడానికి కూడా సమయం పడుతుంది. అదే సమయంలో పొత్తికడుపు కండరాలు, పెల్విక్ ఫ్లోర్ కండరాలు సడలిపోతాయి. బిడ్డ పెరుగుతున్న కొద్దీ పొత్తికడుపు కండరాలు సాగిపోవడం, పెల్విక్ ఫ్లోర్ కండరాల బలం తగ్గడం జరుగుతుంది. అందువల్ల ప్రసవం తర్వాత కూడా పొట్టలో ఇంకా బిడ్డ ఉన్నట్లుగా అనిపించడం సహజమేనని నిపుణులు చెబుతున్నారు.

ప్రసవం వెంటనే బరువులో మార్పు..

ప్రసవం జరిగిన వెంటనే కొంత బరువు తగ్గడం సహజంగా జరుగుతుంది. బిడ్డ బరువు, మాయ, గర్భంలో ఉన్న ద్రవం, శరీరంలో నిల్వ ఉన్న అదనపు ద్రవాలు తగ్గడం వల్ల సుమారు ఐదు కిలోల వరకు బరువు తగ్గే అవకాశం ఉంటుంది.



మహిళల్లో యోని నుంచి తెల్లని లేదా ఇతర రకాల స్రావాలు రావడం సాధారణమైన శారీరక ప్రక్రియలో భాగమేనని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే దీనిని చాలామంది మహిళలు అనారోగ్యానికి సంకేతంగా భావించి ఆందోళన చెందుతుంటారు. వాస్తవానికి రుతుచక్రంలో హార్మోన్ల స్థాయిల్లో వచ్చే మార్పుల కారణంగా గర్భాశయ ముఖద్వారం నుంచి విడుదలయ్యే శ్లేష్మం పరిమాణం, రంగు, స్వభావంలో మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ మార్పులను గమనించడం ద్వారా మహిళలు తమ శరీరంలో జరుగుతున్న సహజ మార్పులను మరింతగా అర్థం చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

ూ× అఅ ంజూశీతీం జఱుఎవశీ 2ూ× అఅ ంజూశీతీం జఱుఎవశీ 2

ఈస్ట్రోజెన్ స్థాయిలు తక్కువగా ఉంటే..రుతుచక్రం ప్రారంభ దశలో యోని పొడిగా అనిపిస్తుంది లేదా శ్లేష్మం చాలా తక్కువగా ఉంటుంది. ఈ సమయంలో ఈస్ట్రోజెన్ స్థాయిలు తక్కువగా ఉండడంతో గర్భాశయ ముఖద్వారం మూసి ఉంటుంది. ఆ తర్వాత ఈస్ట్రోజెన్ స్థాయిలు పెరగడం ప్రారంభించినప్పుడు స్రావం మందంగా, జిగటగా మారుతుంది. అనంతరం లోషన్‌లా క్రీమీలాంటి స్రావం కనిపిస్తుంది. మరికొంత సమయం తర్వాత అది మరింత తడిగా, జారుడుగా మారుతుంది. సాధారణంగా అండోత్సర్గానికి ముందు ఈస్ట్రోజెన్ స్థాయిలు అత్యధికంగా ఉన్నప్పుడు స్రావం పారదర్శకంగా, సాగే స్వభావంతో పచ్చి గుడ్డులోని తెల్లసొనలా కనిపిస్తుందని నిపుణులు వివరిస్తున్నారు.

రుతుచక్రాన్ని బట్టి మారుతుంది..

సాధారణంగా 28 రోజుల రుతుచక్రం ఉన్న మహిళల్లో 11 నుంచి 15వ రోజుల మధ్య పారదర్శకంగా, సాగే స్వభావం కలిగిన గర్భాశయ ముఖద్వార శ్లేష్మం కనిపించే అవకాశం ఉంటుంది. అయితే ప్రతి మహిళలో సమయం ఒకేలా ఉండదు.



రక్తపోటు సమస్య ఉన్నవారు ఎలాంటి ఆహారం తీసుకోవాలి.. గుండెను ఎలా రక్షించుకోవాలి..

అధిక రక్తపోటు సాధారణంగా కనిపించే ఆరోగ్య సమస్య అయినప్పటికీ, దాన్ని నిర్లక్ష్యం చేస్తే గుండె జబ్బులు, పక్షవాతం, మూత్రపిండాలు దెబ్బతినడం, చూపు కోల్పోవడం వంటి తీవ్రమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. రక్తపోటును నియంత్రణలో ఉంచేందుకు జీవనశైలిలో మార్పులు చేసుకోవడంతోపాటు అవసరమైతే వైద్యుల సూచన మేరకు మందులు వాడడం, క్రమం తప్పకుండా రక్తపోటును పర్యవేక్షించడం కీలకమని నిపుణులు చెబుతున్నారు.

ఆహారం, నిద్ర, ఒత్తిడి, శారీరక చలనం, శరీర బరువు, వయసు, కుటుంబంలో అధిక రక్తపోటు చరిత్ర వంటి అనేక అంశాలు రక్తపోటుపై ప్రభావం చూపుతాయని వారు సూచిస్తున్నారు.

ఉప్పును తగ్గించాలి..

రక్తపోటును ఆరోగ్యకరంగా ఉంచడంలో ఉప్పు, సోడియం తీసుకునే పరిమాణాన్ని తగ్గించడం ముఖ్యమైన చర్యల్లో ఒకటి. ప్యాకేజ్డ్ ఆహారాలు, అధికంగా ప్రాసెస్ చేసిన పదార్థాలు, చిప్స్ వంటి ఉప్పు ఎక్కువగా ఉండే చిరుతిళ్లు, ప్రాసెస్ చేసిన మాంసాహారం, తయారుగా లభించే సాస్‌లు, రెడీమేడ్ ఆహారాలను పరిమితం చేయడం మంచిది. వీటికి బదులుగా తాజా, సహజమైన ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే పొటాషియం, పీచు అధికంగా ఉండే ఆలుగడ్డలు, చిలగడదుంపలు, చేర్చుకోవడం రక్తపోటు నియంత్రణకు తోడ్పడతాయి.

‘ఐ హేట్ మ్యారేజ్’ టీజర్ విడుదల..

జెన్ జీ ఆలోచనలతో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్!



నేటి తరంలో ప్రేమ, పెళ్లి, కెరీర్ మరియు స్వతంత్ర జీవనంపై యువత ఆలోచనలను ప్రతిబింబిస్తూ తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ‘ఐ హేట్ మ్యారేజ్’ (× ఙ్ఞవ మీథతీతీఱఊ్రవ). సుగి విజయ్, జుప్పీ భద్ర జంటగా నటిస్తున్న ఈ చిత్రంతో పరమేశ్ రేణుకుంట్ల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆర్య సినిమా బ్యానర్‌పై మాదం దయానంద్, కార్తిక్ వెంపటి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ‘అప్పుడే పెళ్లా’ లిరికల్ వీడియో సాంగ్‌కు సోషల్ మీడియాలో భారీ స్పందన లభించడమే కాకుండా ట్రెండింగ్‌లో నిలిచింది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్ర యూనిట్ ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసింది.

టీజర్ విడుదల సందర్భంగా దర్శకుడు పరమేశ్ రేణుకుంట్ల మాట్లాడుతూ.. “ప్రేమ, పెళ్లి, కెరీర్‌తో పాటు స్వతంత్రంగా జీవించాలనే నేటి జెన్ జెడ్ (+వఙ్గ) తరం ఆలోచనలు, భావజాలాన్ని వాస్తవానికి దగ్గరగా చూపించే ప్రయత్నమే ఈ చిత్రం. జీవితంలో యువత ఎదుర్కొనే భావోద్వేగాలు, నిర్ణయాలను సహజంగా ఆవిష్కరించే ప్రయత్నం ఇందులో ఉంటుంది. ప్రతి యువత ఈ సినిమాలోని పాత్రలతో కనెక్ట్ అవుతారు. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు ఇదొక చక్కటి అనుభూతిని ఇస్తుంది” అని తెలిపారు.

ఈ చిత్రంలో హారిక రాజేందర్, సాహితి కృష్ణ కీలక పాత్రల్లో నటిస్తుండగా, పృథ్వీరాజ్, రవివర్మ అద్దూరి, ప్రభావతి, ఆశ్రిత వేముగంటి, లోహిత్ కుమార్, బేబి తమోఘ్న, రాధ రాయసం, లక్ష్మి, జాకీర్, విజయ్ కుమార్, దాసరి పద్మ రేఖ, శ్రీదేవి ఆర్రోజు, మెయిల్ రమేష్, అరుణ్ కుమార్ రెడ్డి, ఇందు, అఖండ సుధాకర్ రెడ్డి తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని విజయ్ సి. కుమార్ అందించగా, సంగీతం మరియు పాటలను వరికుప్పల యాదగిరి సమకూర్చారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను ప్రవీణ్ ఇమ్మడి అందించగా, ఎడిటింగ్ బాధ్యతలను ఆవుల వెంకటేష్ నిర్వహించారు. ఆర్ట్ డైరెక్టర్‌గా మోహన్ జల్లా వ్యవహరించగా, అడిషనల్ డైలాగ్స్‌ను శ్రీనివాస్ తేజ అందించారు. అల్లు చాణక్య, రాజ్ కృష్ణ కొరియోగ్రఫీ అందించిన ఈ చిత్రానికి దయానంద్ మాదం, కార్తిక్ వెంపటి నిర్మాతలుగా వ్యవహరించగా, సంతోష్ రేణికుంట్ల, కాశీగారి కోదండ రామ శర్మ సహ నిర్మాతలుగా ఉన్నారు. రచన, మాటలు, స్క్రీన్‌ప్లే సమకూర్చడంతో పాటు పరమేశ్ రేణుకుంట్ల ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.

బాలీవుడ్‌లో మరో బంపరాఫర్

దక్షిణాది యువతరంలో మంచి క్రేజ్ సంపాదించుకున్న అచ్చ తెలుగందం శ్రీలీల ఇప్పుడు హిందీలో కూడా వరుస అవకాశాలను అందిపుచ్చుకుంటున్నది. ప్రస్తుతం కార్తీక్ ఆర్యన్‌తో కలిసి అనురాగ్‌బసు దర్శకత్వంలో ఓ రొమాంటిక్ మ్యూజికల్ డ్రామాలో శ్రీలీల నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ భామ హిందీలో మరో

సిద్ధార్థ్ గుప్తా ప్రధాన పాత్రలో రొమాంటిక్ థ్రిల్లర్ చిత్రం తెరకెక్కుతున్నది. దీనికి ఉమేశ్ బిష్ట్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో జాన్వీకపూర్, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా తొలి షెడ్యూల్ శు క్రవారం ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్‌లో ప్రారంభమైంది. ముక్కోణపు ప్రేమకథా చిత్రమిదని సమాచారం. బాలాజీ మోషన్ పిక్చర్స్ పతాకంపై ఏక్తా కపూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలీవుడ్‌లో తొలి చిత్రం రిలీజ్ కాకముందే మరో భారీ ఆఫర్‌తో శ్రీలీల అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది.



కత్తి పట్టిన సీతగా సాయి పల్లవి..

అదరగొడుతున్న ‘రామాయణం’ కొత్త ప్రోమో!

నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్-ఇండియా చిత్రం ‘రామాయణం’ తాలూకు కొత్త ప్రోమో ప్రస్తుతం సినిమా వర్గాల్లో, సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇందులో సీతాదేవిగా నటిస్తున్న సాయి పల్లవి చేతిలో కత్తితో యోధురాలి రూపంలో కనిపించిన విజువల్స్ అందరినీ విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. సాధారణంగా సినిమాలలో సీతాదేవి పాత్రను కేవలం బాధ్యతాయుతమైన భార్యగా మాత్రమే చూపించడం ఆనవాయితీగా వస్తుండగా, ఈ చిత్రంలో ఆమెలోని ధైర్యసాహసాలు, యోధురాలి కోణాన్ని ఆవిష్కరించేలా మేకర్స్ ఈ ప్రోమోను రూపొందించారు.

ఈ విజువల్ వండర్ సినిమాకు సంబంధించిన ఈ కొత్త ప్రోమో సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. రణబీర్ కపూర్ రాముడిగా, యష్ రావణాసురుడిగా, సాయి పల్లవి సీతాదేవిగా నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మర్ సంగీతం అందిస్తున్నారు. నవంబర్ 5న దీపావళి కానుకగా ఈ చిత్ర మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.





కీర్తి సురేశ్ బర్త్‌డే స్పెషల్..

‘అక్క’ యాక్షన్ ప్యాక్డ్ టీజర్ విడుదల!

టాలెంటెడ్ హీరోయిన్ కీర్తి సురేశ్ పుట్టినరోజు సందర్భంగా వరుస అప్‌డేట్లు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. ఇప్పటికే వెంకీ సినిమా నుంచి క్రేజీ అప్‌డేట్ రాగా, తాజాగా ఆమె నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ ‘అక్క’ టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా వస్తున్న ఈ సినిమా టీజర్ పూర్తిగా యాక్షన్ ప్యాక్డ్‌గా, ఉత్కంఠభరితంగా సాగుతూ ప్రస్తుతం సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో కీర్తి సురేశ్‌తో పాటు మరో టాలెంటెడ్ నటి రాధికా ఆప్టే కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం. ఇద్దరు పవర్‌ఫుల్ నటీమణుల కలయికలో వస్తున్న ఈ థ్రిల్లర్ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సరికొత్త లుక్‌లో, అదిరిపోయే యాక్షన్ సీక్వెన్స్‌లతో కీర్తి సురేశ్ కనిపించనున్న ఈ టీజర్ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచేసింది. ఈ చిత్రం అక్టోబర్ 30 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతోంది.

నా కెరీర్‌లో గర్వపడే సినిమా ‘రణబాలి’



‘ఇది నా 14వ సినిమా. ముప్పై సినిమాలు చేసిన తర్వాత కూడా ఒక సినిమా గురించి, అందులోని పర్‌ఫార్మెన్స్ గురించి ప్రేక్షకులు మాట్లాడుకుంటారు. అలాంటి చిత్రమే ‘రణబాలి’. ఈ సినిమా చేస్తున్నప్పుడు పెద్ద హిట్ కొట్టాలి.. బాక్సాఫీస్ వద్ద పెద్ద నెంబర్స్ క్రియేట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోలేదు. అందరికి చెప్పాల్సిన కథ అనిపించింది. నా కెరీర్‌లో గర్వపడే సినిమా అవుతుంది’ అన్నారు అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ.

ఆయన తాజా చిత్రం ‘రణబాలి’ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీమూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ ‘ఈ ఏడాది తెలుగు సినిమా నుంచి వచ్చిన బెస్ట్‌ఫిల్మ్ ఇదని చెప్పగలను.

సినిమాలోని కొన్ని ఎపిసోడ్స్ గురించి గొప్పగా మాట్లాడుకుంటున్నారు. డైరెక్టర్ విక్రమ్ కుమార్‌తో ఓ రొమాంటిక్ సినిమా చేయబోతున్నా. మంచి స్క్రిప్ట్ కుదిరింది. ఇప్పుడు నేను చేస్తున్న ప్రతీ సినిమా ఇష్టపడే చేస్తున్నా’ అన్నారు. జీవితంలో ఏదైనా సాధించాలంటే పోరాడాలనే స్ఫూర్తిని అందించే చిత్రమిదని..ఇందులో రణబాలి, జయమ్మ పాత్రలను తీర్చిదిద్దిన విధానం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నదని కథానాయిక రష్మిక మందన్న పేర్కొన్నది.